మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం TUESDAY 3-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 || సంచిక: 215 Issue: 215

03 ఫిబ్రవరి 2026 - మంగళవారం, శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం - శిశిర ఋతువు, మాఘ మాసం - కృష్ణపక్షం, సూర్యోదయం - ఉ. 6:51, సూర్యాస్తమయం - సా. 6:08, , తిథి, విదియ రా. 12:45o వరకు, తరువాత తదియ, సంస్కృత వారం, భౌమ వాసరః, నక్షత్రం, మఖ రా. 10:11 వరకు, తరువాత పూర్వ ఫల్గుని(పుబ్బ), యోగం, శోభన రా. 2:40o వరకు, కరణం, తైతుల మ. 1:16 వరకు, గరజ రా. 12:45o వరకు, వర్జ్యం, ఉ. 10:28 నుండి మ. 12:01 వరకు, దుర్ముహూర్తం, ఉ. 9:06 నుండి ఉ. 9:51 వరకు, రా. 11:13 నుండి రా. 12:04 వరకు, రాహుకాలం, మ. 3:19 నుండి సా. 4:44 వరకు, యమగండం, ఉ. 9:40 నుండి ఉ. 11:05 వరకు, గుళికాకాలం, మ. 12:30 నుండి మ. 1:54 వరకు, బ్రహ్మముహూర్తం, తె. 5:15 నుండి ఉ. 6:03 వరకు, అమృత ఘడియలు, రా. 7:48 నుండి రా. 9:22 వరకు, అభిజిత్ ముహూర్తం, మ. 12:07 నుండి మ. 12:52 వరకు, గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published From Jagitial
www.evarthalu.com

## అత్తింటి వేధింపులు తాళలేక..

### ముగ్గురు పిల్లల్ని ఉరితీసి ఆత్మహత్యాయత్నం

### కర్ణాటకలోని బాగల్‌కోట్ జిల్లాలో దారుణం



బాగల్‌కోట్: భర్త, అత్త వేధింపులు భరించలేక క్షణికావేశంలో తల్లి కన్నబిడ్డలనే చంపి, అనంతరం తానూ ఆత్మహత్యకు యత్నించిన విషాద ఘటన బాగల్‌కోట్ జిల్లాలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బాగల్‌కోట్ జిల్లాకు చెందిన రూపా హనుమంత్ గౌడర్ (27), హనుమంత్ దంపతులకు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు సమృద్ధి (5), ప్రీతమ్ (4), సుక్షిత్ (2) అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. అయితే కొంతకాలంగా భర్త, అత్త నుంచి వేధింపులు ఎదురవుతున్నాయని రూప తన ఆవేదనను సన్నిహితుల వద్ద వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇంట్లో చిన్నచిన్న విషయాలకే గొడవలు - తరువాయి 3 వ పేజీలో...

## సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు..

## కన్న కూతురును చంపిన తండ్రి

### ముగ్గురు సంతానం అని ఒకరి హత్య



నిజామాబాద్, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనే రాజకీయ ఆశతో, కన్న కూతురినే కడతేర్చాడో కసాయి తండ్రి. ప్రస్తుత సర్పంచ్ ఇచ్చిన సలహాతో ఈ దారుణానికి ఒడిగట్టాడు. ఈ ఘోర ఘటన మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, నాందేడ్ జిల్లా ముక్కెడ్ తాలూకా కేరూర్ గ్రామానికి చెందిన పాండురంగ కొండ్‌మంగళే (28) బార్బర్ షాప్ నడుపుతున్నాడు. అతనికి ఒక కుమారుడు, ఆరేళ్ల వయసున్న కవల కుమార్తెలు ఉన్నారు. ఈ ఏడాది జూన్‌లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలని పాండురంగ ఆశపడ్డాడు. అయితే, మహారాష్ట్ర పంచాయతీ రాజ్ చట్టం - తరువాయి 3 వ పేజీలో...



## వేల కోట్లు కొల్లగొడితే

# జాతిపితనా?

### కేసీఆర్ అసలు ఉద్యమకారుడేనా?.. బీఆర్ఎస్ అధినేతపై రేవంత్ ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కాలంలో కేసీఆర్‌ను ఆ పార్టీ శ్రేణులు జాతిపితగా ప్రకటించేసుకుంటున్నారని.. వేల కోట్లు కొల్లగొట్టి, వందల ఎకరాలు దోచుకున్న కేసీఆర్ అసలు ఉద్యమకారుడేనా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన సమరయోధుడు రావి నారాయణ రెడ్డికి తెలంగాణ సమాజంలో ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.రావి నారాయణ రెడ్డి చరిత్రను పాఠ్యాంశంగా చేర్చడం, వారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వంటి అంశాలపై అందరితో చర్చించి, వారి గౌరవాన్ని పెంచేందుకు మంత్రిమండలిలో నిర్ణయం తీసుకుని సముచితమైన స్థానం

- తరువాయి 2 వ పేజీలో...

## నీ చెత్త బుద్ధి మారదు

### హార్వర్డ్‌కు పోయినా, అంతరిక్షానికి పోయినా చిల్లర మాటలే

### లక్కీ లాటరీలో ముఖ్యమంత్రివి

### సీఎం రేవంత్‌పై హరీశ్ ధ్వజం



హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): హైదరాబాద్‌లో జరిగిన రావి నారాయణ రెడ్డి జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి హేట్ స్పీచ్‌పై హిత బోధ చేసిన కొద్ది నిమిషాలు కూడా గడవకముందే, అదే వేదికపై రేవంత్ రెడ్డి తన అసలు స్వభావాన్ని, తన మాటల ద్వారానే బయటపెట్టుకున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్

- తరువాయి 2 వ పేజీలో...

# డిస్మిస్..!

## ఇష్టమొచ్చినట్లు అరెస్టులు చేయరాదు

### 'సోషల్ మీడియా' అరెస్టులపై సుప్రీం

### తెలంగాణ సర్కారు పిటిషన్ కొట్టివేత

### హైకోర్టు మార్గదర్శకాలకు అభినందన




హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఈవార్తలు)/న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురైంది. సోషల్ మీడియా పోస్టులపై ఇష్టం వచ్చినట్లు కేసులు పెట్టడానికి వీలులేదు అంటూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును అభినందించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేసిన తెలంగాణ సర్కారు పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా సోషల్ మీడియా పోస్టులు పెట్టారని బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త శశిధర్ గౌడ్ (నల్ల బాలు)పై పోలీసులు మూడు ఎఫ్ఐఆర్లు నమోదు చేశారు. ఆ ఎఫ్ఐఆర్‌లను కొట్టేసిన హైకోర్టు పలు మార్గదర్శకాలను జారీ చేసింది. సోషల్ మీడియా పోస్టులపై మెకానికల్‌గా కేసులు నమోదు చేయవద్దని స్పష్టం చేసింది. అయితే, ఆ మార్గదర్శకాలు అభ్యంతరం వ్యక్తం చేసిన తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. అక్కడా రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురైంది. పిటిషన్‌ను డిస్మిస్ - తరువాయి 2 వ పేజీలో...



**హైకోర్టు మార్గదర్శకాలు ..**

సోషల్ మీడియాలో రాజకీయ నాయకులను విమర్శిస్తే ఐపీసీ/ బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయకూడదు. దీనికి సంబంధించి జారీ చేసిన మార్గదర్శకాలు పాటించాలి.

బాధితులతో సంబంధం లేని థర్డ్ పార్టీ వ్యక్తులు ఇచ్చే ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం చట్టవిరుద్ధం. వాక్ స్వాతంత్ర్యాన్ని కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. కేవలం విమర్శలకే అరెస్టులకు పాల్పడటం సరికాదు.

## బంగారం-వెండి ధరలు



**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,317 |
| వెండి (గ్రాము): | రూ.300 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,097 |

## విశ్వవాణి



ఉద్యోగం మానేయాలని చూస్తున్నవారికోసం జపాన్‌లో ఒక బార్ ఉంది. అక్కడ మందు కూడా ఫ్రీగా దొరుకుతుంది. టెన్షోకూ సోడాన్ బార్ అనే ఈ బార్‌లో బార్‌టెండర్లే కెరీర్ కౌన్సెలర్లు. అక్కడికి వచ్చేవారి సమస్యలు విని, దానికి తగ్గ పరిష్కార మార్గం చెబుతారు. ఆత్రుత, ఆందోళలను వదిలేలా, తమ భావాలను బహిరంగంగా వ్యక్తపరుచుకొనేలా చేస్తారు.

## సజ్జనార్ 'ఇల్లీగల్' ట్వీట్..!

### ఫోన్ ట్యాపింగ్ విచారణపై వ్యాఖ్యలు

### తీవ్రంగా మండిపడ్డ హరీశ్, కేటీఆర్

*ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆదివారం మాజీ సీఎం కేసీఆర్‌ను సిట్ విచారించిన సంగతి తెలిసిందే. ఈ విచారణ ముగిసిన అనంతరం సిట్‌కు చీఫ్‌గా ఉన్న సజ్జనార్ తన వ్యక్తిగత ఎక్స్ ఖాతా నుంచి ఓ పోస్టు చేశారు.*



హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): 'అక్రమ ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన కేసులో గజ్వేల్ ఎమ్మెల్యే, మాజీ సీఎం కేచంద్రశేఖర్ రావును సిట్ ప్రశ్నించడం పూర్తయింది' అని పోస్టులో పేర్కొన్నారు. ఆ పోస్టుపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. సజ్జనార్ చేసిన ట్వీట్‌లో కేసీఆర్‌ను 'గారు' అని సంబోధించలేదని, ప్రతిపక్ష నేత అనే ఆయన హోదాను విస్మరించారని బీఆర్ఎస్ శ్రేణులు మండిపడుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ ఎక్కడ జరిగిందో వాస్తవాలు చెప్పడం లేదని కేటీఆర్ అన్నారు. 'సీరియల్ మాదిరి ఫోన్ ట్యాపింగ్ కేసు నడిపిస్తున్నారు.. ఫోన్ ట్యాపింగ్ జరగలేదని నిన్నటి విచారణలో

- తరువాయి 2 వ పేజీలో...

## 2 గంటల్లో బెంగళూరుకు!

### హైదరాబాద్ నుంచి హైస్పీడ్ రైలు


### కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి





హైస్పీడ్ రైళ్లు గంటకు 350 కిలోమీటర్ల వేగంతో పరుగు పెడతాయని, హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో వెళ్లవచ్చని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. హైస్పీడ్ కారిడార్‌తో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,454 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ హైస్పీడ్ రైళ్లు ఉభయ తెలుగు రాష్ట్రాలకు (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) గేమ్ చేంజర్‌గా మారతాయని వెల్లడించారు. హైదరాబాద్ నుంచి చెన్నై, పుణె, బెంగళూరుకు 3 హైస్పీడ్ రైళ్లు రానున్నాయని, దీంతో హైదరాబాద్

- తరువాయి 2 వ పేజీలో...



# టారిఫ్‌లు తగ్గిస్తున్నాం

### భారత్‌కు ట్రంప్ గుడ్ న్యూస్

### 18 శాతానికి తగ్గిన సుంకాలు

### ప్రధాని మోదీతో ఫోన్ సంభాషణ

*భారత్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గుడ్‌న్యూస్ చెప్పారు. భారత్‌పై విధిస్తున్న వివిధ టారిఫ్‌లను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించారు.*

వాషింగ్టన్/న్యూఢిల్లీ: భారత్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గుడ్‌న్యూస్ చెప్పారు. భారత్‌పై విధిస్తున్న వివిధ టారిఫ్‌లను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. అంతకుముందు ప్రధాని మోదీతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడిన ట్రంప్.. కొద్ది సేపటికే టారిఫ్‌లను తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో భారత్‌పై అమెరికా 25శాతం అదనపు సుంకాన్ని విధించగా, దాన్నీ పూర్తిగా తొలగించినట్లు ప్రకటించారు. 'భారత ప్రధాని మోదీతో - తరువాయి 2 వ పేజీలో...

## యాపిల్‌పై మోజు

### భారత్‌లో 28 % వాటా సొంతం



ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో దూకుడుగా వ్యవహరిస్తోంది. భారత మార్కెట్లో 28 శాతం వాటాను దక్కించుకుంది. 2

## బాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం

### టీడీపీ దాడులపై సజ్జల వార్నింగ్



తాడేపల్లి, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వంపై వైసీపీ పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో నియంతృత్వ పాలన కొనసాగుతోందని ఆరోపించారు. బందిపోట్ల తరహాలో వైసీపీ నేతల ఇళ్లలోకి చొరబడి టీడీపీ కార్యకర్తలు దాడులు చేస్తున్నారని... పోలీసుల సాయంతో దాడులు చేయడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. టీడీపీ చేస్తున్న దాడుల్ని ప్రజాస్వామ్యయుతంగానే ఎదుర్కొంటామని అన్నారు. వైసీపీ తిరిగి అధికారంలోకి వచ్చాక చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చి తీరుతామని హెచ్చరించారు. సజ్జల రామకృష్ణా రెడ్డి సోమవారం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో మాజీ మంత్రి జోగి రమేష్ నివాసానికి వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం సజ్జల రామకృష్ణా రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో గత మూడు, నాలుగు రోజులుగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే బాధ కలుగుతోంది. రాజ్యాంగం ఇచ్చిన హక్కులు, పరిమితుల ప్రకారం రాజకీయ పార్టీలు సరిగా వ్యవహరిస్తేనే ప్రజాస్వామ్యం నిలబడుతుందని అన్నారు. అయితే రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన కనుమరుగైనట్టుగా ఉందని ఆరోపించారు. గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబు

- తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

3-2-2026

మేషం: ఆర్థికంగా అవసరానికి సహాయం అందుతుంది. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు కలుగుతాయి. సన్నిహితుల నుండి శుభవార్తలు అందుతాయి. వాహనం కొనుగోలు ప్రయత్నాలు కలసివస్తాయి. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. వ్యాపారాలలో ఆర్థిక లబ్ధి కలుగుతుంది. ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

వృషభం: చేపట్టిన పనులలో అవాంతరాలు కలుగుతాయి. నూతన ప్రయత్నాలు అంతగా కలిసిరావు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. వృధా ఖర్చు విషయంలో ఆలోచించి వ్యవహరించడం మంచిది. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. వృత్తి వ్యాపారాలలో అధికారులతో చికాకులు కలుగుతాయి. నిరుద్యోగుల యత్నాలు మందగిస్తాయి.

మిధునం: కుటుంబ సభ్యుల నుండి సహాయ సహకారాలు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారుల సహాయంతో కొన్ని పనులు పూర్తి చేసుకుంటారు. నూతన కార్యక్రమాలు ప్రారంభించి అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. వ్యాపారపరంగా కీలక నిర్ణయాలు తీసుకుని లాభాల బాట పడతారు. నిరుద్యోగులకు ఉద్యోగ యోగం ఉన్నది.

కర్కాటకం: ఆరోగ్య విషయాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఉద్యోగస్తులకు ఒత్తిడి పెరిగి చికాకులు అధికమవుతాయి. ఇంటా బయట ప్రతికూల వాతావరణం ఉంటుంది. ప్రయాణాలు శ్రమతో కూడి ఉంటాయి. ఆర్థికంగా కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి.

సింహం: వ్యాపార ఉద్యోగాలు అభివృద్ధి బాటలో సాగుతాయి. నూతన పరిచయాలు పెరుగుతాయి. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. గృహంలో శుభకార్యాలు నిర్వహిస్తారు. రాజకీయ సంబంధ సమావేశాలకు ఆహ్వానాలు అందుతాయి. నూతన వ్యాపార ప్రారంభానికి పెట్టుబడులు సకాలంలో అందుతాయి.

కన్య: ముఖ్యమైన వ్యవహారాలలో కుటుంబ పెద్దలు సలహాలు తీసుకోవడం మంచిది. మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో పై అధికారులతో సఖ్యత కలుగుతుంది. వ్యాపారాల్లో ఆశించిన లాభాలు అందుకుంటారు. నిరుద్యోగులకు నూతన అవకాశాలు ఉంటాయి.

తుల: వాహన ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఇంటాబయట సమస్యలు అధికమవుతాయి. దీర్ఘకాలిక ఋణ ఒత్తిడి వలన నూతన ఋణప్రయత్నాలు చేస్తారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వృత్తి వ్యాపారాలలో లాభాలు అందుకోవడానికి మరింత కష్టపడాలి ఉద్యోగస్తులకు అదనపు పనిభారం ఉంటుంది.

వృశ్చికం: వ్యాపార వ్యవహారాలలో అవరోధాలు తొలగుతాయి. కుటుంబ వ్యవహారాలలో ఆకస్మికంగా నిర్ణయాలు మార్పులు చేస్తారు. చేపట్టిన పనులలో జాప్యం కలిగినా నిదానంగా పూర్తిచేస్తారు. దైవ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ విషయంలో తొందరపాటు నిర్ణయాలు చేయటం మంచిది కాదు.

ధనస్సు: గృహమున వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారు. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ఉద్యోగ విషయంలో అధికారులతో సఖ్యతగా వ్యవహరించి ఉన్నత పదవులు పొందుతారు.

మకరం: నూతన గృహ వాహన యోగం ఉన్నది. నిరుద్యోగులకు శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. బంధుమిత్రులతో సహకార విషయాల గురించి చర్చిస్తారు. వృత్తి వ్యాపారాలలో పెట్టుబడుల విషయంలో అంచనాలు అందుకుంటారు. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. ఆర్థికంగా పురోగతి సాధిస్తారు.

కుంభం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. రావలసిన డబ్బు సకాలంలో చేతికి అందక నిరాశ పడతారు. ముఖ్యమైన వ్యవహారాల్లో తొందరపాటు నిర్ణయాలు చేసి ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వ్యాపార ఉద్యోగాలలో కొంత ప్రతికూల పరిస్థితులు ఉంటాయి.

మీనం: ముఖ్యమైన వ్యవహారాలు వాయిదా వేస్తారు. నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి. కుటుంబ విషయాలలో స్థిరత్వం లేని ఆలోచనల వలన వివాదాలు కలుగుతాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. నూతన రుణాలు చేయకపోవడం మంచిది. నిరుద్యోగ ప్రయత్నాలు నత్తనడకన సాగుతాయి.

# డిస్మిస్..!



మొదటి పేజీ తరువాయి

చేస్తూ హైకోర్టు తీర్పును అభినందిస్తున్నామని, మార్గదర్శకాలు ఇవ్వడంలో తప్పేం లేదని పేర్కొంది.

**హైకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలు ఇవీ..**

- సోషల్ మీడియాలో రాజకీయ నాయకులను విమర్శిస్తే ఐపీసీ/ బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయకూడదు. దీనికి సంబంధించి జారీ చేసిన మార్గదర్శకాలు పాటించాలి.
- బాధితులతో సంబంధం లేని థర్డ్ పార్టీ వ్యక్తులు ఇచ్చే ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం చట్టవిరుద్ధం. వాక్ స్వాతంత్ర్యాన్ని కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. కేవలం విమర్శలకే అరెస్టులకు పాల్పడటం సరికాదు.
- పరువు నష్టానికి సంబంధించిన ఫిర్యాదులపై.. పోలీసులు నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేయకూడదు. బాధితులను మేజిస్ట్రేట్‌ను ఆశ్రయించాల్సిందిగా సూచించాలి. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 174(2) కింద మేజిస్ట్రేట్ జారీ చేసిన ఆదేశాల ప్రకారమే పోలీసులు చర్యలు తీసుకోవాలి.
- ప్రతి సందర్భంలోనూ యాంత్రికంగా అరెస్టులు చేయకూడదు. దీనికి సంబంధించి అర్నేశ్ కుమార్ వర్సెస్ బీహార్ కేసులో.. సుప్రీం కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను తప్పక పాటించాలి.
- రాజకీయ ప్రేరేపిత పోస్టులు లేదా ఇతర సున్నితమైన వ్యక్తీకరణలకు సంబంధించిన ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసే ముందు.. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభిప్రాయాన్ని తీసుకోవడం తప్పనిసరి. ఒక ఫిర్యాదు రాజకీయ ప్రేరేపితమైనదని తేలితే.. దర్యాప్తునకు కారణాలు లేవంటూ పోలీసులు కేసు మూసేయాలి.
- తీవ్ర నేరారోపణలు ఉన్న సందర్భాల్లో పోలీసులు కేసు నమోదు చేసే ముందుకు ప్రాథమిక విచారణ జరిపాలి. అందులో చట్టబద్ధమైన అంశాలు ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలి. చట్టబద్ధమైన ఆధారాలు లేకుండా, రాజకీయ విమర్శలపై కేసులు పెట్టకూడదు.
- హింస, ద్వేషం, అశాంతిని ప్రేరేపించే ప్రాథమిక ఆధారాలు ఉంటే తప్ప.. ఇలాంటి అంశాలకు సంబంధించి కేసులు ఫైల్ చేయొద్దు. ఈ విషయంలో కేదార్‌నాథ్ సింగ్ వర్సెస్ బీహార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు తప్పక పాటించాలి.
- ఆర్టికల్ 19(1)(ఏ) కింద సాధారణ రాజకీయ విమర్శలకు రాజ్యాంగం రక్షణ కల్పిస్తుంది. ఒక పోస్ట్ లేదా ప్రసంగం హింసను ప్రేరేపించేలా లేదా శాంతిభద్రతలకు తక్షణ ముప్పు కలిగించేలా ఉన్నప్పుడు మాత్రమే పోలీసులు చట్టాన్ని అమలు చేసే అధికారం ఉంది.

# బాబుకు రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం

మొదటి పేజీ తరువాయి



నివాసం వద్ద టీడీపీ గూండాలు, చంద్రబాబు, లోకేష్ పంపిన వ్యవస్థీకృత నేరగాళ్లు ఏం చేశారో ప్రజలు చూశారని... పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారని ఆరోపణలు చేశారు. అంబటి రాంబాబు ఇంటి దగ్గర టీడీపీ శ్రేణులు గుంపుగా చేరి, పెట్రోల్ బాంబులు వేస్తుంటే దగ్గరుండి అంతా చేయించారని ఆరోపించారు. అంబటి రాంబాబు ప్రాణాలకు హాని ఉందని... పోలీసు ఉన్నతాధికారులకు ఫోన్ చేసినా ఎత్తలేదని అన్నారు. అంబటి రాంబాబు ఇంటిపై పోలీసుల సమక్షంలోనే దాడి జరిగిందని ఆరోపించారు. పోలీసులను అడిగితే తమ పార్టీ శ్రేణుల మీదే కేసులు పెట్టారని ఆరోపించారు. దాడి చేసిన వారికి భద్రత కల్పించి, ఫిర్యాదు చేయడానికి వెళ్తే తమ నాయకులకు లోపలికి అనుమతి ఇవ్వలేదని అన్నారు. జరిగిన ఘటనపై కావాల్సినన్ని వీడియో సాక్ష్యాలు ఉన్నాయని చెప్పారు. ఆదివారం మరో నేత జోగి రమేశ్ ఇంటి మీద దాడి చేశారని, పెట్రోల్ బాంబులు విసిరారని చెప్పారు. ముందస్తు వ్యూహంతో ఈ దాడి చేశారని ఆరోపించారు. దాడి వల్ల ఇంట్లో ఉన్న ఎవరికైనా ప్రాణహాని కలిగితే ఎవరిది బాధ్యత ? అని ప్రశ్నించారు. ఇలా వ్యవహరించే ఎవరికీ రాజకీయ పార్టీగా ఉండే అర్హత లేదని అన్నారు. పోలీసు వ్యవస్థ కొంతైనా నిష్పాక్షికంగా ప్రవర్తించాలని అన్నారు. ప్రభుత్వ పెద్దలు తమకు కావాల్సిన వారి సాయంతో పోలీసు వ్యవస్థను నడుపుతున్నారని ఆరోపించారు. తమ పార్టీ నాయకుల మీద జరుగుతున్న దాడులు చూస్తే... రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతోందని స్పష్టం అవుతుందని అన్నారు. ఎక్కడో ఊరు బయట బందిపోట్లు వచ్చి దాడి చేశారంటే ఏదో అనుకోవచ్చని... కానీ నగరం నడిబొడ్డున, పోలీసుల సమక్షంలో, వారి మద్దతుతో దాడులు జరుగుతున్నాయని చెప్పారు. అంతేకాకుండా తమ నేతల మీద ఎదురు కేసులు పెడుతూ అరాచక పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. జోగి రమేష్ ఇంటిపై దాడి జరిగితే ఇప్పటివరకు పోలీసులు వచ్చి ఆధారాలు సేకరించలేదని సజ్జల అన్నారు. లోకేష్‌ను దుర్భాషలు ఆడారని జోగి రమేష్ మీదే కేసులు పెట్టారని.. లోకేష్‌కు బుర్ర పాడైందని చెప్పినా కేసులేనా?, అంత అసహనం ఎందుకు ? అని ప్రశ్నించారు. ఇలాంటి దాడుల్ని ప్రజాస్వామ్యయుతంగానే ఎదుర్కొంటామని చెప్పారు. జాతీయ స్థాయిలో తమ గొంతు వినిపించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. "రాజకీయ ప్రత్యర్థులు మీ మీద వాడిన భాష మీద చట్టబద్ధంగా ఫిర్యాదులు చేయడానికి, కేసులు పెట్టడానికి అవకాశం ఉంది. అవేవీ కాదని నేరుగా దాడులకు పాల్పడటం, తిరిగి మా మీదే కేసులు పెట్టడం, పరామర్శలకు వెళ్లిన వారిని అరెస్టు చేయడాన్ని అందరూ ప్రశ్నించాలి. తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారి పవిత్ర ప్రసాదం మీద చంద్రబాబు చేసిన చెండాలపు ప్రచారం, జంతువుల కొవ్వు కలిసిందనే అబద్ధపు ప్రచారం సీబీఐ సిట్ ఇచ్చిన రిపోర్ట్, జాతీయ ల్యాబ్స్ ఇచ్చిన రిపోర్ట్స్ ఆధారంగా మేం ప్రశ్నించాం. అది భరించలేక మళ్లీ నెయ్యిలో కల్తీ ఉందనే అబద్ధపు ప్రచారం చేస్తూ జగన్మోహన్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, సుబ్బారెడ్డి ఫొటోలతో ఫ్లెక్సీలు వేశారు. వాటిని తీసేయడానికి ప్రయత్నిస్తే కర్రలు, రాళ్లతో దాడులు చేయడం నుంచి వచ్చిన పరిణామాలే ఇవి" అని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తే సహించలేక తమపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ఈ పరిణామాలపై కేంద్ర హోంశాఖ కార్యదర్శిని తమ ఎంపీ కలవబోతున్నారని... జాతీయ మానవహక్కుల కమిషన్‌ను కూడా ఆశ్రయిస్తామని చెప్పారు. ఈ దాడులతో తమ నేతలు ఎక్కడా చెక్కుచెదరలేదని... ప్రశ్నిస్తూనే ఉంటాం అనే కృత నిశ్చయంతో తమ నేతలు ఉన్నారని తెలిపారు. నేతలకు అంతటి మనోధైర్యం ఇవ్వగల నాయకత్వం వైఎస్ జగన్ రూపంలో తమకు ఉందని చెప్పారు. 'మీ గొయ్యి మీరు తవ్వుకోండి, మా మీద చేసే ప్రతీ దాడికీ రికార్డు ఉంటుంది. మేం అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చట్టబద్ధంగా చెల్లిస్తాం. ఊరిలో రౌడీల్ని, గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లతో దాడులు చేయించం. అన్ని రకాల కేసులు పెట్టి చట్టబద్ధంగానే తేల్చుకుంటాం. జరిగిన దానికి రిటర్న్ గిఫ్ట్ చంద్రబాబుకు కచ్చితంగా ఇస్తాం. చంద్రబాబు ఎన్ని అడ్డంకులు కల్పించినా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతూనే ఉంటాం' అని పేర్కొన్నారు.

# నీ చెత్త బుద్ధి మారదు

మొదటి పేజీ తరువాయి

రావు ధ్వజమెత్తారు. హేట్ స్పీచ్‌పై ఉపన్యాసం ముగియకముందే, రేవంత్ రెడ్డి హేట్ స్పీచ్‌కు లైవ్ డెమో ఇచ్చారు. కేసీఆర్‌పై కడుపులో కత్తులు, నోటిలో విషం పెట్టుకున్న రేవంత్ రెడ్డి తన అజీర్తిని, అక్కసును మరోసారి బయటపెట్టారని మండిపడ్డారు. 'హేట్ స్పీచ్ అంటే ఏమిటో చెప్పడానికి పుస్తకాలు అవసరం లేదు.. రేవంత్ రెడ్డి ప్రసంగాలు చాలు. అమెరికా వెళ్లి హార్వర్డ్ లో నాలుగు రోజులు చదువుకున్నా.. రేవంత్ రెడ్డి తన వెనకటి గుణం మాత్రం మార్చుకోలేదు. కనీస సంస్కారం రాలేదు. చిల్లర మాటల్లో, వెకిలి చేతల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు హరీష్ రావు. ద్వేష రాజకీయాలకు, నరం లేని నాలుకతో విషం చిమ్మే కుసంస్కారానికి నిలువెత్తు నిదర్శనం రేవంత్ రెడ్డి.దేశానికి గాంధీ జాతిపిత అయినట్లే, తెలంగాణను సాధించిన కేసీఆర్ జాతి పితనే. రేవంత్ రెడ్డినాలుగు కోట్ల ప్రజలు ఏకమై స్వరాష్ట్రం కోసం కొట్లాడుతుంటే ఆంధ్రా పాలకుల బూట్లు తుడుస్తున్న నీకు కేసీఆర్ గురించి, తెలంగాణ ఉద్యమం గురించి ఎలా తెలుస్తుందన్నారు. ఉద్యమకారులపైకి తుపాకి ఎక్కుపెట్టిన నీకు ఉద్యమకారుల గురించి మాట్లాడే హక్కు ఉందా రేవంత్ రెడ్డి?' అని హరీశ్ రావు ప్రశ్నించారు. ప్రశ్నిస్తే, నిలదీస్తే అరెస్టులు, కేసులతో నిరంకుశంగా వ్యవహరిస్తున్న నీకు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే హక్కు ఉందా.. రేవంత్ రెడ్డి? అధికారాన్ని ప్రజల బాగు కోసం కాకుండా, ప్రతిపక్షాలపై రాజకీయ కక్షల కోసం వినియోగిస్తున్న నీకు అధికార దుర్వినియోగం గురించి మాట్లాడే హక్కు ఉందా.. రేవంత్ రెడ్డి? లక్కీ లాటరీలో ముఖ్యమంత్రి అయిన నీకు ఇవన్నీ ఎలా తెలుస్తాయి..? ఎలా అర్థం అవుతాయి రేవంత్ రెడ్డి..? నువ్వు అమెరికాలోని హార్వర్డ్ వెళ్లినా, అంతరిక్షం వెళ్లినా నీ చెత్త బుద్ధి మారదు, నోటి మురికి పోదు అన్నది సుస్పష్టమైందని ఎద్దేవా చేశారు.

# 2 గంటల్లో బెంగళూరుకు!

మొదటి పేజీ తరువాయి

నుంచి బెంగళూరుకు 2 గంటల్లో వెళ్లవచ్చని అన్నారు. పుణెకు గంట 55 నిమిషాలు, చెన్నైకి 2 గంటల 55 నిమిషాల్లో చేరుకోవచ్చని అన్నారు. సోమవారం న్యూఢిల్లీ నుంచి వర్చువల్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడారు. రాష్ట్రాల వారీగా కేటాయింపులు, కీలక రైల్వే ప్రాజెక్టులను వివరించారు. బెంగళూరును హైదరాబాద్, చెన్నైతో కలిపే ప్రతిపాదిత హై-స్పీడ్ రైలు కారిడార్‌లను ప్రధాన గేమ్ చేంజర్లుగా వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్ 2026–27ను కర్ణాటకకు రికార్డ్ బడ్జెట్‌గా అభివర్ణించారు. రూ.7,748 కోట్ల రైల్వే కేటాయింపులు, రాష్ట్రంలో రూ.52,950 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రకటించారు. బడ్జెట్‌లో ప్రకటించిన హై-స్పీడ్ రైలు ప్రాజెక్టులు దక్షిణ భారతదేశంలో అంతర్ నగర ప్రయాణాన్ని గణనీయంగా మారుస్తాయని వైష్ణవ్ అన్నారు. బెంగళూరు-చెన్నై-హైదరాబాద్ హై-స్పీడ్ రైలు కారిడార్‌ను డైమండ్ ప్రాజెక్ట్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ బడ్జెట్‌లో కర్ణాటకకు బుల్లెట్ రైలు ప్రతిపాదనలు అత్యంత ముఖ్యమైన ప్రయోజనాల్లో ఒకటిగా మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. బెంగళూరు-చెన్నై కారిడార్ ప్రయాణ సమయాన్ని కేవలం ఒక గంట 13 నిమిషాలకు తగ్గిస్తుందని అన్నారు. 'బెంగళూరు-చెన్నై ఒక విధంగా రెండు విలీన నగరాలుగా మారతాయి. రోజులో ఏ సమయంలోనైనా వెళ్లి రావొచ్చు. చెన్నైలో పని పూర్తి చేసి అదే రోజు బెంగళూరుకు తిరిగి రావచ్చు. అదేవిధంగా బెంగళూరు-హైదరాబాద్ హై-స్పీడ్ రైలు మార్గం ప్రయాణ సమయం దాదాపు రెండు గంటలు మాత్రమే అవుతుంది' అని పేర్కొన్నారు.

# యాపిల్‌పై మోజు

## భారత్‌లో 28 శాతం వాటా సొంతం

న్యూఢిల్లీ: ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో దూకుడుగా వ్యవహరిస్తోంది. భారత మార్కెట్‌లో 28 శాతం వాటాను దక్కించుకుంది. కౌంటర్‌పాయింట్ రిసెర్చ్ నివేదిక ప్రకారం, దేశీయ కస్టమర్లు ప్రీమియమైజేషన్‌లో భాగంగా ఖరీదైన స్మార్ట్‌ఫోన్‌ల కొనుగోళ్లను ఇష్టపడుతున్నారు. దీనివల్ల యాపిల్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో విలువ పరంగా 28 శాతం వాటాను సొంతం చేసుకుంది. అమ్మకాల సంఖ్యలో యాపిల్ వృద్ధి స్థిరంగా ఉన్నప్పటికీ, దేశవ్యాప్తంగా కస్టమర్లు ఖరీదైన మోడళ్లకు అప్‌గ్రేడ్ అవుతున్నందున మొత్తం మార్కెట్ విలువ చాలా వేగంగా విస్తరిస్తోంది. 2024లో యాపిల్ విలువ వాటా 23 శాతంగా ఉంది. ఆ తర్వాత ఐఫోన్ 16 సిరీస్ విజయవంతం కావడం, వేగంగా అమలు చేసిన ఫైనాన్సింగ్, ట్రేడ్-ఇన్ ఆఫర్లు కంపెనీని దేశంలోనే అత్యధిక వాటా సాధించేందుకు సహకరించాయి. పండుగ సీజన్ సందర్భంగా ఇచ్చిన ప్రమోషన్లు ఆదాయ వృద్ధికి మద్దతిచ్చాయి. దీంతో 2025లో యాపిల్ 28 శాతం వాటాతో విలువ పరంగా మార్కెట్‌లో అగ్రస్థానంలో నిలిచింది. అలాగే, గతేడాది దేశంలో అత్యధికంగా రవాణా చేసిన మోడల్‌గా యాపిల్ ఐఫోన్ 16 నిలిచిందని నివేదిక వెల్లడించింది. కాగా, గతేడాది దేశవ్యాప్తంగా ప్రీమియం విభాగం(రూ. 30 వేలకు పై ఖరీదైనవి) అమ్మకాల్లో 11 శాతంతో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని కౌంటర్‌పాయిన్ రిసెర్చ్ డైరెక్టర్ తరుణ్ పాఠక్ పేర్కొన్నారు.

# టారిఫ్‌లు తగ్గిస్తున్నాం

మొదటి పేజీ తరువాయి

మాట్లాడాను. నా అత్యంత సన్నిహిత మిత్రుల్లో ఆయననొకరు. శక్తివంతమైన నేత. ఇరువురం వాణిజ్యం, ఉక్రెయిన్ - రష్యా యుద్ధంతోపాటు అనేక అంశాలపై చర్చించాం. రష్యా నుంచి చమురు కొనుగోలును నిలిపివేసి.. అమెరికా, వెనెజువెలా నుంచి ఎక్కువ చమురు కొనుగోలు చేయడానికి మోదీ అంగీకరించారు. ఈ నేపథ్యంలో తక్షణమే అమల్లోకి వచ్చేలా అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందాన్ని మేం అంగీకరించాం. దీని ప్రకారం అమెరికా విధించే ప్రతీకార సుంకాన్ని 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తాం. అంతేకాకుండా అమెరికాపై విధిస్తున్న సుంకాలను పూర్తిగా తొలగించేందుకు భారత్ ముందుకొస్తుంది. సుమారు 500 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువైన ఇంధన, సాంకేతిక, వ్యవసాయ, బొగ్గు, ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేస్తామని మోదీ హామీ ఇచ్చారు. భారత్‌తో సంబంధాలు భవిష్యత్‌లో మరింత బలోపేతం కానున్నాయి' అని ట్రంప్ పోస్టు చేశారు.

టారిఫ్‌లను 25శాతం నుంచి 18శాతానికి తగ్గిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రకటన చేసినందుకు 140 కోట్ల భారత్ ప్రజల తరఫున ట్రంప్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. 'నా ప్రియ మిత్రుడు ట్రంప్‌తో మాట్లాడటం చాలా సంతోషంగా ఉంది. భారత్‌లో తయారైన ఉత్పత్తులపై సుంకాన్ని 18శాతానికి తగ్గించినందుకు ఆనందంగా ఉంది. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలు కలిసిన పని చేసినప్పుడు.. ప్రజలకు ప్రయోజనం చేకూర్చడమే కాకుండా, పరస్పర సహకారానికి అపారమైన అవకాశాలు ఏర్పడతాయి. ప్రపంచశాంతి, శ్రేయస్సు కోసం డొనాల్డ్ ట్రంప్ నాయకత్వం ఎంతో కీలకం. శాంతి కోసం ఆయన చేస్తున్న కృషికి భారత్ పూర్తి మద్దతిస్తోంది. మునుపెన్నడూ లేని విధంగా ఇరుదేశాల భాగస్వామ్యాన్ని ఉన్నత శిఖరాలను తీసుకెళ్లేందుకు ఆయన కలిసి పని చేయాలని ఆశిస్తున్నా' అని పేర్కొన్నారు.

# వేల కోట్లు కొల్లగొడితే జాతిపితనా?

మొదటి పేజీ తరువాయి

కల్పిస్తామని వెల్లడించారు. 'తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు' ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మవిభూషణ్ 'రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ పురస్కారం -- 2025'ను ముఖ్యమంత్రి చేతుల మీదుగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'అరాచక శక్తులకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడు రావి నారాయణ రెడ్డి. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా...పేద ప్రజల కోసం తన 500 ఎకరాల భూమిని దానం చేసిన గొప్ప వ్యక్తి'అని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. 'బండెనక బండి కట్టి, పదహారు బండ్లు కట్టి' అని తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేసిన బండి యాదగిరి లాంటి నిరక్షరాస్యులను కూడా ప్రభావితం చేసిన గొప్ప నాయకుడు అని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. 'దేశంలో మొట్టమొదటి ప్రధాని నెహ్రూ కంటే ఎక్కువ మెజారిటీతో పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ప్రజా తీర్పును ప్రతిబింబించేలా ఆనాడు మొట్టమొదటి పార్లమెంట్ భవనాన్ని రావి నారాయణ రెడ్డితో నెహ్రూ ప్రారంభింపజేశారు. 60 ఏళ్ల వయసులో ప్రజలకు స్ఫూర్తినిస్తూ పార్టీ, రాజకీయ పదవుల నుంచి తప్పుకున్న గొప్ప నేత రావి నారాయణ రెడ్డి. మున్సిపల్ ఎన్నికల అనంతరం రావి నారాయణ రెడ్డికి సముచిత గౌరవం ఇచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలు తీసుకుంటాం'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. 'తెలంగాణ ప్రజల స్వేచ్ఛ కోసం, పేదల హక్కుల కోసం పోరాటం చేయడమే కాదు, సర్వం త్యాగం చేసిన మహనీయుడు రావి నారాయణ రెడ్డి.న్యాయ వ్యవస్థ ద్వారా ప్రజల హక్కుల కోసం పని చేసిన, రాజ్యాంగం పట్ల సంపూర్ణ నిబద్ధత కలిగిన జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికిఈ అవార్డు ప్రదానం చేయడం అత్యంత సముచితం. నేడు దేశంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం, ప్రజల ఓటు హక్కు రక్షణ కోసం, ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం రావి నారాయణ రెడ్డి స్ఫూర్తితో పని చేయాల్సిన అవసరం ఉంది'అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 'నిర్వాహకులు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారు. తొలితరంలో బూర్గుల రామకృష్ణారావు, రావి నారాయణ రెడ్డి స్ఫూర్తినిస్తే, మలితరంలో ఎస్. జైపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి వంటి వారు తెలంగాణ సమాజానికి స్ఫూర్తినిచ్చారు అని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి తెలంగాణ సమాజానికి ఒక స్ఫూర్తిగా నిలిచారు. రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో వారు పోషించిన పాత్ర మనందరికీ గుర్తుంది. వారి అనుభవాలు పరిపాలనలో ఉపయోగపడుతున్నాయి'అని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. మాజీ సీఎం కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వేల కోట్లు కొల్లగొట్టి, వందల ఎకరాలు దోచుకున్న కేసీఆర్ అసలు ఉద్యమకారుడేనా అని ప్రశ్నించారు.'అర్ధరాత్రి ప్రొఫెసర్ కోదండరాం ఇంటి తలుపులు పగులగొట్టినప్పుడు ఆయన ఉద్యమకారుడని గుర్తులేదా? అని నిలదీశారు. అర్ధరాత్రి ప్రొఫెసర్ కోదండరాం సారు ఇంటి దర్వాజాలు పలగొట్టినప్పుడు గుర్తు రాలేదా ఆయన ఉద్యమకారుడు అని అన్నారు.నువ్వు ఉద్యమమారుడు కోదండరామ్ సార్‌ని అవమానించినట్లు మేము నిన్ను అవమానించలేదు కదా అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.'ఇటీవల కాలంలో కొంతమంది తెలంగాణ జాతిపిత అని వాళ్లకే వాళ్లే టైటిల్ ఇచ్చుకుంటున్నారు.

# సజ్జనార్ 'ఇల్లీగల్' ట్వీట్..!

మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ చెప్పారు.. హరీష్ రావుకు సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇచ్చింది.. ఫోన్ ట్యాపింగ్ ఘట్టాన్ని ఇంతటితో ముగించాలి' అని తెలిపారు. హైదరాబాద్ సీపీ సజ్జనార్ అయినా, ఇంకో అధికారి అయినా ఫోన్ ట్యాపింగ్ ఇల్లీగల్ అనుకుంటే కోర్టుకు వెళ్లాలి కదా అని సూచించారు. సజ్జనార్ జడ్జి కాదు, పోలీస్ అధికారి మాత్రమే అని చురక అంటించారు. ఈ మధ్య కాలంలో సజ్జనార్ జడ్జి అయ్యాడేమో అంటూ సెటైర్ వేశారు.

**అక్రమం అని మీరెలా నిర్ణయించారు?: హరీశ్**

సజ్జనార్ తన పోస్టులో 'అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు' అని పేర్కొనడంపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధమా? కాదా? అనేది విచారణ పూర్తయి కోర్టులు నిర్ణయించక ముందే మీరెలా నిర్ణయిస్తారు? అని మండిపడ్డారు. ఆల్ ఇండియా సర్వీసెస్ కండక్ట్ రూల్స్ కు విరుద్ధంగా సజ్జనార్ వ్యవహరిస్తున్నారని, ఈ కేసు విషయంలో సిట్ చీఫ్ ముందే ఒక అభిప్రాయాన్ని ఏర్పరుచుకున్నట్లు కనిపిస్తోందని ధ్వజమెత్తారు. విచారణ దశలోనే ఏ చర్యనైనా అక్రమమని తేల్చే అధికారం సిట్□కు లేదని భారత టెలిగ్రాఫ్ చట్టం, సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాల ఆధారంగా మాత్రమే ఏ ఫోన్ ఇంటర్ సెప్షన్ చట్టబద్ధమా? లేదా అక్రమమా? అనేది నిర్ణయించాల్సి ఉంటుందన్నారు.

# రాజ్యాంగమా? రాజకీయమా?



ఒకప్పుడు అధికారులు తమ విధులను నిశ్శబ్దంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేవారు. కానీ, ప్రస్తుతం పరిస్థితి మారుతోంది. ప్రజాప్రతినిధులుగా మారకముందే కొందరు అధికారులు రాజకీయ నాయకుల తరహాలో ప్రకటనలు చేస్తున్నారు. తాజాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో సజ్జనార్ గారు వాడిన కొన్ని పదాలు 'న్యాయస్థానం నిర్ణయించకముందే తీర్పు ఇచ్చినట్లు ఉన్నాయి' అని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. సీనియర్ జర్నలిస్టుల అరెస్టు విషయంలోనూ ఆయన చేసిన వ్యాఖ్యలు స్వేచ్ఛా పత్రికా వ్యవస్థపై దాడిలా ఉన్నాయని ఆరోపణలు వ్యక్తమయ్యాయి. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ (కాండక్ట్) రూల్స్, 1964 ప్రకారం, ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఎల్లప్పుడూ రాజకీయ తటస్థత పాటించాలి. ప్రభుత్వ విధానాలను లేదా రాజకీయ అంశాలను బహిరంగంగా విమర్శించడం లేదా సమర్థించడం సేవా నియమావళికి విరుద్ధం. అధికారులు కేవలం దర్యాప్తుకు పరిమితం కావాలి తప్ప, మీడియా ముందు జడ్జి పాత్ర పోషించకూడదు. ఇది విచారణ నిష్పక్షపాతంగా జరుగుతుందా? అన్న అనుమానాలను ప్రజల్లో కలిగిస్తుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అధికారులు రాజకీయ పక్షాల మధ్య నలిగిపోతున్నారు. బదిలీలు, పోస్టింగ్‌ల కోసం అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం, తద్వారా తదుపరి ప్రభుత్వం వచ్చినప్పుడు విచారణలు ఎదుర్కోవడం ఒక పరిపాటిగా మారింది. ఐఏఎస్, ఐపీఎస్ అసోసియేషన్లు సైతం అధికారుల వ్యక్తిగత ప్రయోజనాల కంటే వ్యవస్థ గౌరవాన్ని కాపాడటంలో చొరవ చూపాల్సిన అవసరం ఉంది. అధికార గణం రాజ్యాంగానికి, ప్రజలకు జవాబుదారీగా ఉండాలి తప్ప, రాజకీయ యజమానులకు కాదు. సజ్జనార్ వంటి సీనియర్ అధికారులు తమ అనుభవాన్ని నేర నియంత్రణకు, ప్రజా రక్షణకు వాడాలి. దర్యాప్తు సంస్థల అధిపతులు మీడియా చర్చల్లో కాకుండా, కోర్టు బోనులో తమ సాక్ష్యాధారాలను నిరూపించుకున్నప్పుడే వ్యవస్థపై నమ్మకం పెరుగుతుంది. రాజకీయాల్లోకి రావాలనుకుంటే రాజీనామా చేసి రావచ్చు, కానీ రాజ్యాంగబద్ధ కుర్చీలో ఉండి రాజకీయాలు మాట్లాడటం ప్రజాస్వామ్యానికి చేటు.

- ఈవార్తలు సంపాదకీయ విభాగం

## అత్తింటి వేధింపులు తాళలేక..

మొదటి పేజీ తరువాయి

జరుగుతుండేవని, ఈ క్రమంలో శనివారం రాత్రి కూడా భార్యాభర్తల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని పరిస్థితులు రూపను ఈ ఘోర నిర్ణయానికి ఒడిగట్టినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఉదయం సుమారు 10 గంటల సమయంలో హనుమంత్ తన తల్లిని గుడిలో దింపి, అనంతరం పొలం పనులకు వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో రూప మాత్రమే ఉండటంతో, మానసిక ఒత్తిడికిలోనైన ఆమె అఘాయిత్యానికి పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ముందుగా తన ముగ్గురు చిన్నారులను ఉరేసి చంపిన రూప.. అనంతరం డీజిల్ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో ఇంటికి తిరిగివచ్చిన హనుమంత్, తలుపులు లోపల నుంచి గడియ వేసి ఉండటాన్ని గమనించాడు. ఎంత పిలిచినా స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చి స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టారు. ఇంట్లోకి వెళ్లగానే అక్కడి దృశ్యాలు అందరినీ కంటతడి పెట్టించాయి. ముగ్గురు చిన్నారులు విగతజీవులుగా వేలాడుతూ కనిపించగా, రూప అపస్మారక స్థితిలో పడి ఉంది. స్థానికుల సహాయంతో రూపను బాగల్‌కోట్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

### సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు..

## కన్న కూతురును చంపిన తండ్రి

మొదటి పేజీ తరువాయి

ప్రకారం, ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉన్నవారు ఎన్నికల్లో పోటీకి అనర్హులు. దీంతో, పెద్ద కూతురు ప్రాచీని అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకు ప్రస్తుత గ్రామ సర్పంచ్, అతని స్నేహితుడైన గణేష్ షిండే సలహా ఇచ్చాడు. పథకం ప్రకారం, పాండురంగ తన కూతురు ప్రాచిని బైక్‌పై తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాకు తీసుకెళ్లాడు. అక్కడ నిజాంసాగర్ కాలువలో చిన్నారిని తోసి హత్య చేశాడు. కాలువలో బాలిక మృతదేహం లభించడంతో, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన నిజామాబాద్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సౌ చైతన్య నేతృత్వంలోని బృందం పాండురంగను విచారించగా, మొదట అతను పొంతనలేని సమాధానాలు చెప్పాడు. పోలీసులు తమదైన శైలిలో గట్టిగా ప్రశ్నించడంతో అసలు నిజాన్ని ఒప్పుకున్నాడు. మొదట పాపను దత్తత ఇవ్వాలని, ఆ తర్వాత వదిలేయాలని భావించినా.. చివరకు హత్య చేయడమే సరైన మార్గమని తండ్రి, సర్పంచ్ నిర్ణయించుకున్నట్లు కమిషనర్ సౌ చైతన్య తెలిపారు. పాండురంగ ఇచ్చిన సమాచారంతో, అతనికి సలహా ఇచ్చిన సర్పంచ్ గణేష్ షిండేను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఇద్దరిపై హత్య, నేరపూరిత కుట్ర కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపింది.

## 2015లోనే తెలంగాణకు తాడిచెర్ల-1 గనులు

**రాజ్యసభలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**



న్యూఢిల్లీ: తాడిచెర్ల-1 బొగ్గు గనుల విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. 2015 ఆగస్ట్ 31న తెలంగాణ విద్యుత్ సంస్థకు దీనిని కేటాయించినట్లు తెలిపింది. ఈ మేరకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాజ్యసభలో వెల్లడించారు. 2019 మార్చిలో ఉన్నత స్థాయి కమిటీ నివేదిక ఆమోదం అనంతరం, 2020 జూన్ నుంచి బొగ్గు గనుల కేటాయింపుల ప్రక్రియ మారినట్లు తెలిపారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో తాడిచెర్ల కోల్ బ్లాక్ గురించి కేంద్రమంత్రి స్పందించారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కేంద్ర బడ్జెట్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులు లేవని, ఇది తెలంగాణ ప్రజలను నిరాశపరిచిందని అన్నారు. 2020 జూన్ నుంచి బొగ్గు వేలం ప్రక్రియలో ప్రభుత్వరంగ సంస్థలకు బొగ్గు బ్లాక్‌లు కేటాయించలేదని తమిళనాడుకు చెందిన ఎంపీ డాక్టర్ తంబిదురై అన్నారు. వేలం ప్రక్రియలో రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, ప్రైవేటు రంగ కొనుగోలుదారులకు కట్టపెడుతున్నారని ఆరోపించారు. దీంతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందిస్తూ, తెలంగాణ విద్యుత్ సంస్థకు తాడిచెర్ల-1 బొగ్గు గనులను కేటాయించినట్లు తెలిపారు.

## కేంద్ర నిధుల కోసమే మున్సిపల్ ఎన్నికలు

**టీజీ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు**



హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల కోసమే మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తున్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఎన్నో మోసపూరిత వాగ్దానాలు చేసిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్ళు దాటినప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని ఈ కాంగ్రెస్ ప్రభుత్వంపై మోసపూరిత వాగ్దానాల పేరుతో ఛార్జ్‌షీట్ విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ఓట్లు పొందిందని, కానీ ప్రజలకు ఇప్పటి వరకు చేసిందేమీ లేదని అన్నారు. ఈ రెండేళ్ల కాలంలో ప్రజలకు, రాష్ట్రానికి ఏం చేసిందో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాలని నిలదీశారు. ఉద్యోగులకు సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదని, విద్య, వైద్యాన్ని నిర్లక్ష్యం చేశారని, నిరుద్యోగులకు ఇస్తామన్న రూ.4 వేల నిరుద్యోగ భృతి జాడ లేదని మండిపడ్డారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్సుమెంట్స్ కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి వచ్చే పథకాలు నేరుగా లబ్ధిదారులకే అందుతున్నాయని అన్నారు.

# వివాదాల్లో ఐపీఎస్ సజ్జనార్

**గతంలో ప్రజలతో జేజేలు**

**నేడు వరుస విమర్శలు**



హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): సీనియర్ ఐపీఎస్ అధికారి, ప్రస్తుత హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఇటీవల వరుస వివాదాలతో వార్తల్లో నిలుస్తున్నారు. ప్రధానంగా తెలంగాణలో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో ఆయన వ్యవహరిస్తున్న శైలిపై రాజకీయ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ చీఫ్‌గా ఉన్న సజ్జనార్, దర్యాప్తు పూర్తికాకముందే దీనిని అక్రమ ఫోన్ ట్యాపింగ్ అని సంబోధించడంపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. న్యాయస్థానం తేల్చకముందే ఆయన ఒక నిర్ణయానికి రావడం నిబంధనలకు విరుద్ధమని హరీశ్ రావు వంటి నేతలు విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావును విచారించే సమయంలో, సజ్జనార్ తన ట్వీట్లలో ఆయన పేరును ఏకవచనంతో సంబోధించారని, గౌరవప్రదమైన పదాలు (గారు) వాడలేదని బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. గతంలో ఎక్కడ పని చేసినా తనదైన మార్క్ చూపిన సజ్జనార్.. అంతే స్థాయిలో ప్రజల చేత జేజేలు పలికించుకున్నారు. అయితే ఇటీవల ఆయనపై వస్తున్న వరుస విమర్శలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. మొన్నటికి మొన్న ఓ ప్రముఖ న్యూస్ చానల్ జర్నలిస్టుల అరెస్టుల విషయంలో ఆయన మాట్లాడిన మాటలు చర్చనీయాశంగా మారాయి. ఆ సమయంలో సజ్జనార్ వ్యాఖ్యలను పలువురు జర్నలిస్టులు, రాజకీయ నేతలు ఆక్షేపించారు. ఈ వ్యవహారం ముగిసిపోగా తాజాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంట్రవర్సీ వ్యాఖ్యలు చేశారు.

### గతంలో పలు విమర్శలు

ఆర్టీసీ ఎండీగా ఉన్న సమయంలో సుమారు 200 మంది కండక్టర్లను చిన్న తప్పులకే తొలగించారని, ఆ ప్రక్రియలో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ బాధితులు ప్రధానమంత్రికి, ముఖ్యమంత్రికి సజ్జనార్‌పై ఫిర్యాదు చేశారు. 2019 నాటి దిశ నిందితుల ఎన్‌కౌంటర్ విషయంలో సజ్జనార్‌ను సుప్రీంకోర్టు నియమించిన కమిషన్ గతంలో ప్రశ్నించింది. దీనిని ఇన్‌స్టంట్ జస్టిస్ (తక్షణ న్యాయం) పేరుతో కొందరు ప్రశంసించినా, చట్టవిరుద్ధమైన హత్యలుగా మరికొందరు విమర్శిస్తూనే ఉన్నారు.

# కేటీఆర్ మాటల్లో రాచరికపు పోకడలు

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): కేటీఆర్ మాట్లాడుతున్న మాటలు రాచరికపు పోకడలకు, నియంతృత్వానికి నిదర్శనంగా ఉన్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున ఎవరు నిలబడ్డా... కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కేటీఆర్ అంటున్నారని... మున్సిపల్ ఎన్నికల్లో గుణం చూసి ఓటు వేయాలని చెప్పారు. పని చేసే వాళ్లకు, మంచి అభ్యర్థులకు మాత్రమే ఓటు వేయాలని అన్నారు. చెడ్డ వాళ్లకు ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారా? అని ప్రశ్నించారు. జాగృతి అభ్యర్థులు ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై పోటీ చేస్తారని తెలిపారు. కవిత వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందిస్తూ... కవితపై బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే చర్యలు తీసుకుందని అన్నారు. ఆమె గురించి తాను ప్రత్యేకంగా స్పందించాల్సిన అవసరం లేదని చెప్పారు. రాజకీయాల్లో రోజూ ఎంతో మంది మాట్లాడుతుంటారని... ప్రతి వ్యక్తికి, ప్రతి వ్యాఖ్యకు కౌంటర్ ఇవ్వాల్సిన అవసరం లేదని అన్నారు.



**ఇంకెన్ని రోజులు ట్యాపింగ్ విచారణ?**

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ట్యాపింగ్ వ్యవహారంలో విచారణను తొందరగా ముగించి దోషులకు శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సిట్ విచారిస్తున్న విషయం తెలిసిందే. ఈ కేసులో అధికారులకు సహకరించేందుకు తాను సిద్ధమని చెప్పారు. అధికారులు పిలిస్తే తాను విచారణకు హాజరవుతానని కవిత తెలిపారు. ఈ మేరకు ఈ రోజు ఉదయం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ మొదలై రెండు సంవత్సరాలు గడించిందని గుర్తుచేశారు. విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు గుప్పించారు. విచారణ ఇంకెప్పుడు ముగుస్తుందని, దోషులను ఎప్పుడు శిక్షిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిట్ విచారణలో ఏం జరిగిందనే వివరాలను కేసీఆర్ బయటపెడతారని భావిస్తున్నట్లు ఆమె చెప్పారు. కేసు విచారణనే తప్పుబడుతున్నట్లు కేటీఆర్ మాట్లాడటం సరికాదని కవిత అభిప్రాయపడ్డారు. చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత, అధికారులకు సహకరించాల్సిన విధి ప్రతీ పౌరుడిపైనా ఉందని వ్యాఖ్యానించారు. గుంట నక్కలతో కలిసి డ్రామాలాడుతోందంటూ కాంగ్రెస్ పార్టీపై ఆమె మండిపడ్డారు. తన ఫోన్ ను, తన భర్త ఫోన్ ను ట్యాప్ చేశారనే అనుమానిస్తున్నట్లు చెప్పిన కవిత.. సిట్ విచారణకు అధికారులు పిలిస్తే వెళతానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# రేవంత్‌కు సమాచారం వచ్చినట్లే కేసీఆర్‌కూ!

**ఫోన్ ట్యాపింగ్ కేసులో**

**అబద్ధాలు తేలిపోతున్నాయి: కేటీఆర్**

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం తమకు లేదని, ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమాచారం ఎలా వస్తుందో, నాడు కేసీఆర్ ప్రభుత్వానికి కూడా అలాగే వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ నిన్న రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాలలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కదిలారని అన్నారు. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే మళ్లీ ఉద్యమ రోజులు గుర్తుకువస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో పాలనా వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని, మేడారం జాతర ఏర్పాట్లలో కూడా ప్రభుత్వం విఫలమైందని అన్నారు. దావోస్ ఒప్పందాల ద్వారా వచ్చిన పెట్టుబడులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో వారు చెబుతున్న అబద్ధాలు ఒక్కటొక్కటి తేలిపోతున్నాయని అన్నారు. మొదట వ్యాపారవేత్తలు, ఆ తర్వాత సినిమా తారల ఫోన్లు ట్యాప్ చేశారని చెప్పారని, ఇప్పుడు ఏమీ లేదని అంటున్నారని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన ఖర్మ తమకు లేదని స్వయంగా కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇకనైనా పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సజ్జనార్ తీర్పు చెప్పడానికి ఆయన జడ్జి కాదని ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో వచ్చిన అభియోగాలపై కోర్టులు తేల్చుతాయని అన్నారు. హైదరాబాద్ నగరంలో పట్టపగలు కాల్పులు, దోపిడీ ఘటనలు చోటు చేసుకుంటున్నాయని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సహజ వనరుల దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. సింగరేణి కుంభకోణం అంశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పష్టమైన సమాధానం రాలేదన్నారు. బొగ్గు కుంభకోణంపై సిట్టింగ్ జడ్జి, సీబీఐ విచారణ కోరుతుంటే ఎందుకు వెనక్కి పోతున్నారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో సృజన్ రెడ్డి కాల్ డేటా తీస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ నిలదీస్తోందని, అందుకే సిట్‌ల పేరిట



విచారణలు చేస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. పైశాచిక ఆనందం కోసం కేసీఆర్‌ను అంతసేపు విచారణ పేరుతో కూర్చోబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌పై కేటీఆర్ పెదవి విరిచారు. ఉపాధి హామీని కుదించారని, ఎరువులు, ఆహార రాయితీ, స్వచ్ఛ భారత్ నిధులు తగ్గించారని ఆరోపించారు. బయో ఫార్మా తయారీకి రూ.10 వేల కోట్లు కేటాయించిన కేంద్రం హైదరాబాద్‌కు రూ.10 కూడా కేటాయించలేదని విమర్శించారు. ఢిల్లీకి 60 సార్లు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాధించిందేమిటని ప్రశ్నించారు. రెండు పార్టీల నుంచి 8 మంది చొప్పున ఎంపీలు గెలిచినా రాష్ట్రానికి కలిగిన ప్రయోజనం ఏమీ లేదన్నారు.



## సర్వేలు కాంగ్రెస్ వైపే రెబల్స్ ఉండొద్దు

**సీఎం రేవంత్ దిశానిర్దేశం**

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో సోమవారం మంత్రులు, పీసీసీ నేతలతో సీఎం రేవంత్ జూమ్ మీటింగ్ నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ ఇన్ చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పలువురు మంత్రులు, పీఏసీ సభ్యులు ఈ మీటింగ్ లో పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల వ్యూహాలపై నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు సీఎం రేవంత్ . మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా సమిష్టిగా పనిచేయాలని నేతలకు సూచించారు . 'మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు మనదేనని..సర్వేలు మంచి మెజారిటీ తో గెలుస్తున్నాం అనే ఫీడ్ బ్యాక్ ఇస్తున్నాయి. అంతా సమిష్టిగా కృషి చేయాలి. రెబల్స్ లేకుండా జాగ్రత్తలు తీసుకోండి. పార్టీ కోసం పని చేసిన వాళ్లను గెలిపించుకోవాలి. టికెట్ లు రాని బలమైన నాయకులు ఉంటే కార్పొరేషన్ పదవుల్లో అవకాశం ఇద్దాం అని హామీ ఇవ్వండి. అభ్యర్థిని ఖరారు చేసిన వాళ్లే గెలుపు బాధ్యత తీసుకోవాలి. ప్రతీ అభ్యర్థి లోకల్ గా మేనిఫెస్టో రెడీ చేసుకోవాలి. బీసీలకు రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రిజర్వేషన్ ఇచ్చేలా కేంద్రం మీద ఒత్తిడి పెంచాలి'. అని రేవంత్ నేతలకు దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ ఎన్నికలు ఫిబ్రవరి 11న జరగనుండగా..13న కౌంటింగ్ జరగనుంది. ఈ క్రమంలో జిల్లాల పర్యటనకు సీఎం రేవంత్ సిద్ధమవుతున్నారు. ఫిబ్రవరి 4 నుంచి జిల్లాల్లో ఎన్నికల ప్రచారం చేయనున్నారు.

## ఈ నెల 6 నుంచి అక్రెడిటేషన్ల దరఖాస్తులు!

హైదరాబాద్,ఫిబ్రవరి 2 (ఈవార్తలు) : జర్నలిస్టులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నూతన అక్రెడిటేషన్ల దరఖాస్తులు ఈ నెల 6 నుంచి ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. అధికారి కంగా సమాచారం వెలువరిం చకపో యినా, సమాచార పౌరసంబంధాల శాఖ వెబ్‌సైట్ ప్రకారం.. ఫిబ్రవరి 6వ తేదీ నుంచి దరఖాస్తులు ప్రారంభం కానున్నాయి. వెబ్‌సైట్‌లోని అక్రెడిటేషన్ మాడ్యుల్‌ను క్లిక్ చేస్తే ఈ మేరకు సందేశం కనిపిస్తోంది. అయితే, దీనిపై అధికారికంగా నోటిఫికేషన్ రావాల్సి ఉంది.



## మా పాలనలో అభివృద్ధి పరుగులు

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కిస్తూ అభివృద్ధి, సంక్షేమం దిశగా పరుగులు పెట్టిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఒక్కో ఇటుకను పేర్చుకుంటూ ముందుకు సాగుతున్నామని అన్నారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆధునికీకరించిన సమాచార పౌరసంబంధాల శాఖ వెబ్‌సైట్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయాలు ప్రజల జీవితాలలో స్పష్టమైన మార్పునకు నాంది పలుకుతోందని అన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన ఇలా అన్ని రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు తెలంగాణను ఆదర్శంగా నిలుపుతున్నాయని మంత్రి అన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకుని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు వేగవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సమాచార శాఖ అధికారులకు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

# కలెక్టర్ సారూ.. బడికెట్ల పోవాలె?

## నూకపెల్లి మోడల్ స్కూల్ పిల్లల గోస.. ఒకే బస్సులో విద్యార్థులను కుక్కుతున్నరు



**మల్యాల మండలం నుంచే 200 మంది**

**ఇంకో బస్సు కేటాయించాలని వినతి**

మల్యాల/ జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): ఉన్నది ఒకటే బస్సు.. సీటు దొరికితే సరి.. లేకపోతే నిల్చోవాలె.. అదీ కుదరకపోతే డోర్ దగ్గర వేలాడాలె.. కాలు పెట్టే సందు దొరికితే స్కూలుకు చేరుతరు. లేకపోతే ఇంటి దారి పడుతరు. ఇదీ.. జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో విద్యార్థుల పరిస్థితి. మండలంలోని పలు గ్రామాల నుంచి నూకపెల్లి మోడల్ స్కూల్‌కు దాదాపు 200 మంది విద్యార్థులు వెళ్తుంటారు. వీళ్లందరికీ ఒకే బస్సు అందుబాటులో ఉంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చదువుపై దృష్టి సారించలేక పోతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మేడారం కోసం ఉన్న బస్సూ బంద్!**

ఒక్క విద్యార్థి కోసం ఏళ్ల పాటు ఓ ఊరికి రైలునే నడిపించారు జపాన్‌లో. కానీ, మన అధికారులు ఎంత గొప్పోళ్లంటే.. మేడారం సమ్మక్క సారక్క జాతర కోసం ఉన్న స్కూల్ బస్సునూ బంద్ పెట్టారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దాంతో తమ పిల్లలు స్కూల్‌కు వెళ్లలేక ఇంట్లోనే ఉండిపోయారని తెలిపారు.

**నాలుగు సార్లు అర్జీ పెట్టుకున్నా..!**

దాదాపు 200 మంది విద్యార్థులకు ఒకే బస్సు ఉండటంతో అదనపు బస్సు కేటాయించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నాలుగు సార్లు ఫిర్యాదు చేసినట్లు ఓ విద్యార్థి తండ్రి పోరండ్ల మహేశ్ తెలిపారు. సోమవారం మరోసారి కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. రెండు నెలలుగా అదనపు బస్సు కోసం వినతి పెట్టుకున్నా, స్పందన కరువైందని అన్నారు. అదనపు బస్సు లేక, చాలా సందర్భాల్లో పిల్లలు ఇంటి వద్దే ఉండాల్సి వస్తోందని, మరి వాళ్లకు చదువు ఎలా వస్తుందని నిలదీశారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఇప్పటికైనా అదనపు బస్సును కేటాయించాలని విన్నవించారు.



## సీఎం సభను విజయవంతం చేయాలి: మనోహర్

గంగాధర, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రచారానికి సీఎం రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో సభను విజయవంతం చేయాలని కరీంనగర్ జిల్లా గంగాధర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురుమల్ల మనోహర్ పిలుపునిచ్చారు. సోమవారం గంగాధర మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల నుంచి భారీగా ప్రజలను తరలించాలని, సభను జయప్రదం చేయాలని కార్యకర్తలకు సూచించారు.



## 15న మహా శివరాత్రి జాగరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): శ్రీ మహా శివరాత్రి జాగారణ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన రహీంపుర ప్లే గ్రౌండ్స్ లో మహా శివరాత్రి జాగరణ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు మాడిశెట్టి సదానంద్ గుప్త తెలిపారు. గత 15 సంవత్సరాలుగా జాగారణ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మహా శివరాత్రి జాగారణ ఆహ్వాన పత్రికను సోమవారం శ్రీ శంకర్ హనుమాన్ జీ దేవాలయలయంలో మంగళహాట్ డివిజన్ కార్పొరేటర్ శశికళ కృష్ణ పరమేశ్వరి సింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శశికళ కృష్ణ మాట్లాడుతూ.. మాడిశెట్టి సదానందం గుప్తా 15 సంవత్సరాలుగా జాగారణ వేడుకలు విజయవంతంగా నిర్వహిస్తూ భక్తుల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరి సింగ్, జాగారణ సేవా సమితి అధ్యక్షుడు మాడిశెట్టి సదానందం గుప్తా, ప్రధాన కార్యదర్శి ఎస్. రాజన్ కుమార్, పీ రంజిత్ కుమార్, డీ రాజేందర్ సింగ్, డీ శైలేందర్ సింగ్, గోపాల్ సింగ్, యాద శ్రీనివాస్ గుప్తా, జీ గోపాల్ సింగ్, ప్రదీప్ కుమార్, సురేందర్సింగ్, భాగ్య సింగ్, నవీన్ కుమార్, పాండు, సందీప్ గుప్తా, నితిన్ రాజ్, గోవింద్ గుప్తా, మహేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.



## మల్యాల జీపీని సందర్శించిన ఎమ్మెల్సీ బల్మూరి

మల్యాల, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మేజర్ గ్రామపంచాయతీ పాలకవర్గానికి ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఆయన జీపీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను సర్పంచ్ బొట్ల జయప్రసాద్ శాలువాతో సన్మానించారు. అనంతరం గ్రామంలోని పలు సమస్యలపై ఆయనతో చర్చించి, 8వ వార్డ్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినత పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఈవో శ్రీకాంత్, ఉపసర్పంచ్ కట్కం వినయ్, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

## పవన్ వల్లే మా ఇంటిపై దాడులు

**అంబటి కుమార్తె ఆరోపణలు**

రాజమండ్రి, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): ఏపీ సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో అంబటి రాంబాబుకు కోర్టు రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఆయన ఉన్నారు. జైల్లో ఉన్న అంబటిని ఆయన కూతురు మౌనిక పరామర్శించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. పవన్ కల్యాణ్ ఇచ్చిన బలాన్ని అడ్వాంటేజ్ గా తీసుకుని తమ ఇంటిపై కాపులు దాడి చేశారని మౌనిక అన్నారు. కాపు కులంలో పుట్టినందుకు తాను ఎంతో గర్విస్తున్నానని చెప్పారు. కాపు కులస్తులంతా పవన్ వైపు ఉన్నారని... కాపు మహిళలమైన తమను తిడుతూ తమ ఇంటిపై దాడి చేశారని మండిపడ్డారు. చంద్రబాబు గురించి తన తండ్రి అసభ్య పదజాలంతో మాట్లాడలేదని చెప్పారు. జగన్ ను చంద్రబాబు ఎన్నోసార్లు తిట్టారని మౌనిక అన్నారు. తిరుమల లడ్డూ గురించి వాస్తవాలు మాట్లాడినందుకే తమ ఇంటిపై దాడి చేశారని చెప్పారు. ఆ టాపిక్ నుంచి డైవర్ట్ చేసేందుకే దాడికి దిగారని మండిపడ్డారు. తప్పుల్ని ప్రశ్నిస్తే చంద్రబాబు తల్లిని అన్నట్టుగా చెబుతూ ఇంటిపై దాడి చేశారని అన్నారు. తమ ఇంటిపై దాడి జరుగుతుంటే హోంమంత్రి అనిత ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.



## రైతులు, ప్రజలకు న్యాయం చేయండి

**గ్రీవెన్స్‌లో అధికారులకు వినతిపత్రం**

**సమర్పించిన బాతువు రైతులు, ప్రజలు**

**మూడో లైను విస్తరణకు భూములు**

**కోల్పోతుండడం విన్నపం**

శ్రీకాకుళం, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): రైల్వే మూడో లైను విస్తరణ పనులు కోసం భూములు, పంట పొలాలు, కళ్లాలు, ఇళ్లు కోల్పోతున్న రైతులు, ప్రజలకు న్యాయం చేయాలని కోరుతూ ఏపీలోని శ్రీకాకుళం జిల్లా సిగడాం మండలం బాతువ గ్రామానికి చెందిన రైతులు, ప్రజలు, యువత జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ఎంతో మంది రైతులు, ప్రజలు భూములు, కళ్లాలు కోల్పోవడంతోపాటు గ్రామంలోని వందలాది ఎకరాల భూముల్లో పంటలు పండించేందుకు కీలకంగా ఉన్న పెద్ద చెరువులో చాలా భాగాన్ని కోల్పోవాల్సి వస్తోందని అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. భూములు, ఇళ్లు, కళ్లాలు కోల్పోతున్న రైతులకు న్యాయం చేసేలా రైల్వే అధికారులను ఆదేశించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఇప్పటి వరకు రైల్వే నుంచి చెల్లించే నష్ట పరిహారం గురించి గానీ, ఇతర అంశాలపై స్పష్టత లేదని, ఎవరిని సంప్రదించాలో కూడా తెలియని పరిస్థితి ఉందని వారంతా అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన అధికారులు రైల్వే అధికారులకు సమస్యను తెలియజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పెద్ద చెరువు నీటి సంఘం ప్రెసిడెంట్ ముళ్ల హరినాయుడు, మండల నాయకులు డోల వెంకటరమణ, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల వెంకట రమణ, నాయకులు మీసాల కృష్ణారావు, తనుబుద్ధి సింహాచలం, జమ్ము ఉత్తరనాయుడు, పల్లేడ శ్రీనివాసరావు, కూనుబిల్లి శ్రీనివాసరావు, రెడ్డి సంతోష్, మీసాల శ్రీనివాసరావు, బూటు ముకుంద, బూటు సురేష్, ముల్లు అసిరినాయుడు, వావిలపల్లి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



## బీసీ బడ్జెట్ విడుదల చేయాల్సిందే

**లేదంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం**

**బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరమ్ డిమాండ్**

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): బీసీలకు కేటాయించిన బడ్జెట్‌ను వెంటనే విడుదల చేయాలని బీసీ ఇంటలెక్చ్యువల్స్ ఫోరమ్ డిమాండ్ చేసింది. సోమవారం బీసీ పొలిటికల్ ఫ్రంట్, బీసీ సంఘాలు, కుల సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర బీసీల వాటా మాయ మర్మం రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్య వక్తలుగా టీ చిరంజీవులు, విశారాధన్ మహారాజ్, బాలరాజు బాలగొని పాల్గొని గత 12సంవత్సరాలలో బడ్జెట్లోని బీసీలకు తీవ్ర అన్యాయం జరిగింది అని తక్షణమే వారికి రావలసిన వారి కోటా విడుదల చేయాలి అని డిమాండ్ చేశారు. గత 12సంవత్సరాల్లో 28 వేల కోట్లు మాత్రమే బీసీ డిపార్ట్మెంట్ ద్వారా ఖర్చు చేశారని తీవ్రంగా ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో టీ చిరంజీవులు బీసీలకు బడ్జెట్లో ఏ విధంగా అన్యాయం జరుగుతుంది అనేది సవివరంగా వివరించారు. విశారాధన్ మహారాజ్ మాట్లాడుతూ రాజ్యాధికారమే దీనికి విరుగుడు అని, ఆ దిశగా అందరూ ప్రయాణం చేయాలన్నారు. బాలగొని బాలరాజు మాట్లాడుతూ బడ్జెట్ లో జనాభా ప్రకారం బీసీలకు నిధులు రావాలి అని, అది బీసీల హక్కు అని వ్యాఖ్యానించారు. ఎర్ర సత్య నారాయణ, జనార్ధన్ కూడా ప్రసంగించారు. ఈ సభకు ఎర్రమాద వెంకన్న అధ్యక్షత వహించారు. సభలో ఎంబీసీ అధ్యక్షుడు తిప్పిరి శెట్టి శ్రీనివాస్, మేకల రాములు యాదవ్, దాసోజు లలిత, సూర్యనారాయణ, శంకర్ గంగపుత్ర, సుతారి లక్ష్మణ్, ఎలికట్టే విజయ్ కుమార్, బైరి శేఖర్, దుర్గయ్య గౌడ్ ఐలి వెంకన్న, అంబాల నారాయణ,అవ్వారు వేణు రాపోలు వీరమోహన్, రాపోలు జ్ఞానేశ్వర్, చెన్న శ్రీకాంత్, లింగేష్ యాదవ్ జెల్లా నరేందర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## వెంటనే నర్సింగ్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించాలి

**రాష్ట్ర అధ్యక్షుడు నక్క సూర్యకుమార్ డిమాండ్**

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): తెలంగాణ స్టేట్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ కౌన్సిల్ చట్టం ప్రకారం రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్‌కు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ ఫ్లోరెన్స్ నర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నక్క సూర్య కుమార్ డిమాండ్ చేశారు. టీఎస్ఎన్ఎంసీ చట్టం ప్రధాన లక్ష్యం నర్సింగ్ విద్య, వృత్తి ప్రమాణాలు, నర్సుల హక్కులు, సంక్షేమాన్ని పరిరక్షించడమేనని అన్నారు. అయితే చట్టప్రకారం కౌన్సిల్‌లో ఉండాల్సిన ఎన్నికైన ప్రతినిధులు లేకుండా కేవలం నామినేటెడ్ సభ్యులతో కౌన్సిల్ కొనసాగడం చట్ట ఆత్మకు విరుద్ధమని విమర్శించారు. చట్టం ప్రకారం నర్సింగ్ కౌన్సిల్‌కు ఒక నిర్దిష్ట పదవీకాలం ఉంటుందని, ఆ కాలం ముగిసిన వెంటనే తాజా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల నర్సుల ప్రజాస్వామ్య హక్కులు హరించబడుతున్నాయని ఆరోపించారు. ఎన్నికలు జరగకపోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా నర్సులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా నర్సుల రిజిస్ట్రేషన్, రిన్యూవల్, కంటిన్యూ నర్సింగ్ ఎడ్యుకేషన్, క్రెడిట్ బేస్డ్ రిన్యూవల్ వంటి



అంశాల్లో స్పష్టత లేకపోవడంతో వేలాది మంది నర్సులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. నర్సుల ఫిర్యాదులకు సరైన పరిష్కారం లేకపోవడం ఆందోళనకరమని అన్నారు. చట్ట ప్రకారం ఎన్నికల ద్వారా వచ్చిన నర్సుల ప్రతినిధులే కౌన్సిల్ నిర్ణయాలలో కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికైన కౌన్సిల్ లేకుండా తీసుకునే నిర్ణయాలు నర్సుల అభిప్రాయాలను ప్రతిబింబించవని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నర్సింగ్ కౌన్సిల్‌కు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఎన్నికైన కౌన్సిల్‌తోనే నర్సుల సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రభుత్వం ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా నర్సులను ఏకం చేసి ఉద్యమాలకు దిగుతామని హెచ్చరించారు. నర్సుల హక్కుల పరిరక్షణ కోసం చివరి వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

## చదువుకో.. తెలంగాణ

**పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**



గంగాధర, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): ప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ చేపట్టిన 'మిషన్ 10వ తరగతి' అను పోస్టర్‌ను సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన "మిషన్ 10వ తరగతి" కార్యక్రమం అభినందనీయమని తెలిపారు. చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు గొప్ప ప్రోత్సాహమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం రూ.2.2 కోట్ల నగదు బహుమతులను విద్యార్థులకు అందజేయనున్నారు. మొట్టమొదటి స్థానాన్ని పొందిన విద్యార్థికి రూ.5 లక్షలు,రెండవ స్థానానికి రూ.3 లక్షలు,ప్రతి జిల్లా టాపర్‌కు రూ.2 లక్షలు,119 అసెంబ్లీ ప్రతి నియోజకవర్గ టాపర్లకు రూ.1 లక్ష చొప్పున, అలాగే 612 మండలాలల్లో టాపర్లకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో 2026 మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు వర్తిస్తుందని తెలిపారు. ప్రభుత్వంతో పాటు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి సంస్థలు విద్యారంగానికి తోడ్పడటం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ గంగాధర బ్రాంచ్ మేనేజర్ వేములవాడ అజయ్, సిబ్బంది పోరండ్ల భూపతి, డీవో మంత్రి మహేందర్, గోపాలరావుపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిండి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు దోర్నాల శ్రీనివాస్ రెడ్డి, సుచీన్ యాదవ్, ఆంజనేయులు, మారుతి తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మరక్షణలో చంద్రబాబు: భూమన

తిరుమల, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి విషయంలో సీబీఐ నివేదిక వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆత్మరక్షణలో పడ్డారని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. దీని నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే వైసీపీ నేతలపై దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు ఇచ్చిన నివేదిక ప్రకారమే మాట్లాడానని చంద్రబాబు అంటున్నారని భూమన ఎద్దేవా చేశారు. టీటీడీకి ఈ బోర్డును పరిచయం చేసిందే జగన్ అని చెప్పారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసే అవకాశమే లేదని సీబీఐ తెలిపిందని అన్నారు. చంద్రబాబు హయాంలోనే బోలేబాబా డెయిరీ నుంచి టీటీడీ నెయ్యి కొనుగోలు చేసిందని చెప్పారు.

## కేంద్రానికి పట్టని బాబు: శైలజానాథ్

విజయవాడ, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): కేంద్ర బడ్జెట్ లో ఏపీకి తీరని అన్యాయం జరిగినా ముఖ్యమంత్రి చంద్రబాబు నోరు మెదపడం లేదని మాజీ మంత్రి, వైసీపీ నేత శైలజానాథ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వంలో చంద్రబాబు కీలక నేతగా ఉన్నప్పటికీ... ఆయన ప్రతిపాదనలను కేంద్రం బుట్టదాఖలు చేసిందని చెప్పారు. కేంద్ర నిధులు రాబట్టడంలో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమయిందని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే సొంత ప్రయోజనాలే ముఖ్యమని చంద్రబాబు భావిస్తున్నారా? అని శైలజానాథ్ ప్రశ్నించారు.

## ఇదేనా మీ రూల్ ఆఫ్ లా?

**కూటమి ప్రభుత్వంపై రోజా ఫైర్**

తాడేపల్లి, ఫిబ్రవరి 2 (ఈవార్తలు): ఏపీలోని తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైసీపీ నేతలు, వారి ఆస్తులు, పార్టీ కార్యాలయాలే లక్ష్యంగా దాడుల పరంపర కొనసాగుతోందని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఈ పరిస్థితులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆమె డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్న 'రూల్ ఆఫ్ లా' (చట్టబద్ధమైన పాలన) ఇదేనా? అంటూ ఆమె సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా, రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నేతలపై జరిగిన దాడుల జాబితాను ఆమె వివరించారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్, కొడాలి నాని, పేర్ని నాని, దాడిశెట్టి రాజా ఇళ్లతో పాటు, వల్లభనేని వంశీ, ముద్రగడ పద్మనాభం, భూమన కరుణాకర్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి వంటి సీనియర్ నేతల నివాసాలపై దాడులు జరిగాయని ఆమె పేర్కొన్నారు. హిందూపురం వైసీపీ కార్యాలయం, మార్గాని భరత్ కార్యాలయాలపై కూడా దాడి చేశారని తెలిపారు. అంతేకాకుండా, దేవినేని అవినాశ్, విడదల రజినిపై దాడికి యత్నించారని, ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్‌పై దాడి జరిగిందని వివరించారు. తనపై కూడా ఓ వ్యక్తిని ప్రయోగించి బూతులతో దాడి చేయిస్తున్నారని రోజా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడులు కేవలం రాజకీయ నాయకులకే పరిమితం కాలేదని, పత్రికా కార్యాలయాలపైనా జరిగాయని రోజా ఆరోపించారు. సాక్షి, డెక్కన్ క్రానికల్ మీడియా సంస్థల ఆఫీసులపై జరిగిన దాడులను ఆమె తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ఆమె ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చాక ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకోవడం దారుణమని, చంద్రబాబు పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోందని రోజా విమర్శించారు. ఈ దాడులన్నింటికీ ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని ఆమె స్పష్టం చేశారు.



# భారత్‌లోకి చైనా యుద్ధ ట్యాంకులు

## నరవణే వ్యాఖ్యలను ప్రస్తావించిన రాహుల్.. లోక్‌సభలో గందరగోళం



న్యూఢిల్లీ: ఐదేళ్ల క్రితం నాటి డొక్లామ్ సరిహద్దు ఉద్రిక్తతల అంశాన్ని లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రస్తావించడంతో గందరగోళం ఏర్పడింది. చైనా యుద్ధ ట్యాంకులు భారత్ సరిహద్దులను దాటాయని రాహుల్ గాంధీ లోక్‌సభలో అన్నారు. ఆయన వ్యాఖ్యలపై బీజేపీ సభ్యులు నిరసన తెలిపారు. చైనా సైన్యం భారత సరిహద్దులోకి చొరబడుతోందని ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణే తన పుస్తకంలో రాసిన కొన్ని అంశాలను ఒక మ్యాగజైన్ ప్రచురించింది. ఆ వివరాలను రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రస్తావించారు. లధక్, డొక్లామ్ ప్రతిష్ఠంభనకు సంబంధించి దేశ సైనికులకు వాస్తవాలు తెలుసని రాహుల్ గాంధీ అన్నారు. దేశ ప్రజలకు వాస్తవాలు దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలను మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ ఖండించారు. సభను అవమానించేలా రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ చెబుతున్న పుస్తకం ఇంకా ప్రచురణ కాలేదని, ప్రచురితం కాని పుస్తకంలోని అంశాల గురించి ఎలా మాట్లాడతారని రాజ్‌నాథ్ సింగ్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ నిబంధనల ప్రకారం మాట్లాడాలని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు సూచించారు. వార్తాపత్రికల క్లిప్పింగ్‌లు, ప్రచురణ కాని పుస్తకాలకు సంబంధించిన విషయాలను లోక్‌సభలో ప్రస్తావించకూడదని స్పీకర్ ఓం బిర్లా రూల్ బుక్ నియమాలను చదివి వినిపించారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు చెప్పే తీర్మానంపై మాట్లాడాలని రాహుల్ గాంధీకి సూచించారు.

### కిరణ్ రిజిజు కౌంటర్

భారత ఆర్థిక వ్యవస్థపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కౌంటర్ ఇచ్చారు. టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఇటీవల చేసిన ట్వీట్‌ను ఉటంకిస్తూ... భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని, విమర్శలు చేసేటప్పుడు దేశాన్ని కించపరచకూడదని ఆయన స్పష్టం చేశారు. ఎక్స్ వేదికగా కిరణ్ రిజిజు స్పందిస్తూ... “సాధారణంగా భారతీయులు కాని వారి వ్యాఖ్యలపై నేను స్పందించను. కానీ రాహుల్ గాంధీ కళ్లు తెరిపించేందుకు ఎలాన్ మస్క్ వ్యాఖ్యను ఉటంకిస్తున్నాను. ప్రభుత్వాన్ని విమర్శించడం ప్రజాస్వామ్య హక్కే... కానీ భారత్‌ను కించపరచకూడదు. భారత విజయాలను ఎన్నడూ తక్కువ చేయకూడదు” అని రాశారు. నిన్న ఎలాన్ మస్క్ ఒక లిస్ట్ షేర్ చేశారు. 2026లో చైనా, భారత్ కలిసి ప్రపంచ జీడీపీలో 43.6% ఉంటాయని, అమెరికా 9.9%తో మూడో స్థానంలో ఉంటుందని పేర్కొన్నారు. ఈ డేటా ఐఎంఎఫ్ నుంచి తీసుకున్నదని... ఆసియా-పసిఫిక్ ప్రాంతం ఈ ఏడాది చివరికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 50% కంటే ఎక్కువ ఇస్తుందని మస్క్ రాశారు. “పవర్ బ్యాలెన్స్ మారుతోంది” అని ఆయన కామెంట్ చేశారు. ప్రపంచంలో అత్యంత ధనవంతుడైన మస్క్ భారత ఆర్థిక వ్యవస్థను దగ్గరగా ఫాలో అవుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీని రెండుసార్లు కలిసిన ఆయన... ఆసియా ప్రపంచ ఆర్థిక శక్తిగా మారుతోందని ఈ ట్వీట్ ద్వారా సంకేతం ఇచ్చారు. భారత్ ఈ మార్పులో ముందుందని చెబుతున్నారు. కేంద్ర బడ్జెట్ పై రాహుల్ గాంధీ నిన్న విమర్శలు గుప్పించారు. నిరుద్యోగం, రైతుల సమస్యలు, హౌస్‌హోల్డ్ సేవింగ్స్ తగ్గిపోవడం వంటి అత్యవసర సమస్యలను బడ్జెట్ పట్టించుకోలేదని ఆయన అన్నారు. గతంలో ట్రంప్ చేసిన ‘ఇండియా డెడ్ ఎకానమీ’ వ్యాఖ్యను గుర్తుచేస్తూ రాహుల్ మాట్లాడారు.



## కేంద్రానికి ఆలోచనలు కరువు

**విధానపరమైన దార్శనికత లోపం**

**బడ్జెట్‌పై ఖర్గే ఘాటు విమర్శలు**

**దీటుగా బదులిచ్చిన బీజేపీ**

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ 2026-27పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన తీవ్ర విమర్శలకు బీజేపీ సోమవారం గట్టిగా బదులిచ్చింది. ప్రధాని మోదీ అభివృద్ధి అజెండాను, ప్రపంచ ఆర్థిక వాస్తవాలను కాంగ్రెస్ విస్మరిస్తోందని కమలం పార్టీ అధికార ప్రతినిధి ప్రతుల్ షా డియో మండిపడ్డారు. ఈ సందర్భంగా ప్రతుల్ షా మాట్లాడుతూ, “వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రధాని మోదీకి స్పష్టమైన దార్శనికత ఉంది. కాంగ్రెస్ హయాంలో ఆర్థిక క్రమశిక్షణ గాడితప్పింది. ద్రవ్య లోటు ఎప్పుడూ అదుపులో ఉండేది కాదు. ఈసారి ద్రవ్య లోటు కేవలం 4.3 శాతంగా ఉంది” అని గుర్తుచేశారు. ప్రభుత్వానికి విధానపరమైన దృష్టి లేదన్న ఖర్గే ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు మాంద్యంలో ఉన్నప్పటికీ, భారత్ ఒక ప్రకాశవంతమైన శక్తిగా నిలుస్తోందని, బడ్జెట్ అన్ని కీలక రంగాలకు ప్రాధాన్యత ఇచ్చిందని వివరించారు. అంతకుముందు ఆదివారం, కేంద్ర ప్రభుత్వానికి ఆలోచనలు కరవయ్యాయని ఖర్గే విమర్శించారు. ఉద్యోగాలు, తయారీ రంగం, ద్రవ్యోల్బణం, రైతుల సమస్యలకు బడ్జెట్‌లో ఎలాంటి పరిష్కారాలు చూపలేదని ఆయన ‘ఎక్స్’ వేదికగా ఆరోపించారు. ఎగుమతుల క్షీణత, వాణిజ్య లోటు వంటి అంశాలను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రస్తావించలేదని అన్నారు. ఖర్గే ఆరోపణలను తిప్పికొడుతూ, దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేయడం అత్యవసరమని ప్రతుల్ షా అన్నారు. “ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సాయుధ బలగాలు పాకిస్థాన్‌లోకి వెళ్లి తమ పరాక్రమాన్ని చూపాయి. సరిహద్దుల్లో శత్రుదేశాల నుంచి ముప్పు ఉన్నందున మనం సన్నద్ధంగా ఉండాలి” అని తెలిపారు. ఆర్థిక

# ఐఎస్ఐ ప్లాన్ అట్టర్‌ఫ్లాప్

## బలూచిస్థాన్‌లో పాక్‌కు చుక్కలు.. 40 గంటలకు పైగా బీఎల్‌ఏ దాడుల బీభత్సం




ఇస్లామాబాద్: బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ), తెహ్రీక్-ఏ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) లాంటి సాయుధ గ్రూపులను ఎదుర్కోవడం పాకిస్థాన్ సైన్యానికి కత్తిమీద సాములా మారింది. ఈ క్రమంలో పాక్ సైన్యం, దాని గూఢచార సంస్థ ఐఎస్ఐ వేసిన ఓ ఎత్తుగడ దారుణంగా విఫలమైంది. లష్కరే తోయిబా, ఐఎస్‌కేపీ ఉగ్రవాద సంస్థలను ఏకం చేసి బీఎల్‌ఏపైకి ఉసిగొల్పాలన్న వ్యూహం బెడిసికొట్టింది. బీఎల్ఏ ‘ఆపరేషన్ హీరోఫ్ ఫేజ్ 2’ పేరుతో క్వెట్టా సహా పలు ప్రాంతాల్లో భారీ దాడులకు పాల్పడింది. ఈ దాడులు ఏకధాటిగా 40 గంటలకు పైగా కొనసాగాయి. ఈ ఘటనల్లో సుమారు 200 మంది పాకిస్థాన్ సైనికులను మట్టుబెట్టినట్లు బీఎల్ఏ ప్రకటించింది. అయితే, బలూచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగ్తీ మాత్రం 17 మంది భద్రతా సిబ్బంది, 31 మంది పౌరులు మరణించినట్లు తెలిపారు. ఈ దాడుల తీవ్రతను ఎదుర్కోవడంలో లష్కరే, ఐఎస్‌కేపీ ఉగ్రమూకలు విఫలమవడంతో పాక్ ప్రభుత్వం అంతర్జాతీయంగా పరువు కోల్పోయింది. బలూచ్ పోరాటం ఇప్పుడు కేవలం ఒక సాయుధ తిరుగుబాటుగా కాకుండా ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంటోంది. బలూచ్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ముందుకు వస్తుండటంతో సైన్యానికి పరిస్థితి కష్టంగా మారింది. ఈ పోరాటంలో మహిళలు కూడా పాల్గొనడం గమనార్హం. ఆసిఫా మెంగల్ అనే మహిళ నోష్కిలోని ఐఎస్ఐ ప్రధాన కార్యాలయంపై వాహనంతో ఆత్మాహుతి దాడికి పాల్పడింది. దాడుల్లో మహిళల పాత్ర ఉందని పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ కూడా అంగీకరించారు. బీఎల్ఏ కమాండర్ బషీర్ జైర్ బలోచ్ ప్రజలంతా సమీకృతం కావాలని పిలుపునివ్వడం పాక్ ప్రభుత్వానికి మింగుడుపడడం లేదు. ఈ పరిస్థితుల్లో ఉగ్రవాద సంస్థలను ప్రయోగించడం కంటే బలూచ్ నేతలతో చర్చలు జరిపి వారి డిమాండ్లను అంగీకరించడం మేలని కొందరు అధికారులు అభిప్రాయపడుతున్నారు. బీఎల్ఏ దెబ్బకు భయపడి లష్కరే, ఐఎస్‌కేపీ లాంటి సంస్థలు ఈ పోరాటం నుంచి తప్పుకునే అవకాశాలున్నాయని, వాటిలో ఉన్న చాలామందికి ఈ యుద్ధం చేయడం ఇష్టం లేదని తెలుస్తోంది. ఈ ప్రయోగం విఫలం కావడంతో భవిష్యత్తులో జైషే మహ్మద్ లాంటి ఇతర ఉగ్రసంస్థలను రంగంలోకి దించడం దాదాపు అసాధ్యమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ఓటమి ఉగ్రసంస్థల ప్రతిష్ఠను దెబ్బతీయడమే కాకుండా, కొత్తగా చేరేవారిని కూడా నిరుత్సాహపరుస్తుందని భావిస్తున్నారు.

# అజిత్ పవార్ మృతిలో కుట్ర కోణం

**కాంగ్రెస్, శివసేన నేతలు ఆరోపణలు**

**పైలట్‌ను మార్చడంపై అనుమానాలు**



ముంబై: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మృతి చెందిన ఘటన అనూహ్య మలుపు తీసుకుంది. ఇది కేవలం ప్రమాదం కాదని, దీని వెనుక కుట్ర దాగి ఉందని ప్రతిపక్ష కాంగ్రెస్, శివసేన (యూబీటీ) పార్టీలు సంచలన ఆరోపణలు చేయడంతో రాజకీయ దుమారం రేగింది. ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణ జరపాలని ఆ పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ నేత విజయ్ వడేటివార్ మాట్లాడుతూ, “మహారాష్ట్రలో 80 శాతం మంది ప్రజలు ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదానికి ముందు, చివరి నిమిషంలో పైలట్‌ను ఎందుకు మార్చారు? విమానంలో ఆరుగురు ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం ఉంటే, ఐదు మృతదేహాలే ఎందుకు లభించాయి?” అని తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తారు. కేవలం సీఐడీ విచారణతో నిజాలు బయటకు రావని, నిష్పక్షపాత దర్యాప్తు జరగాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ కూడా ఇదే తరహా అనుమానాలు వ్యక్తం చేశారు. అజిత్ పవార్ తన వర్గాన్ని, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ వర్గాన్ని తిరిగి ఏకం చేసేందుకు ప్రయత్నించారని, ఈ కారణంగానే మహాకూటమిలో ఆయనపై తీవ్ర ఒత్తిడి వచ్చిందని ఆరోపించారు. ఇరిగేషన్ స్కాం ఫైళ్లను అడ్డం పెట్టుకుని బీజేపీ ఆయన్ను బెదిరించిందని అన్నారు. పార్టీలోకి తిరిగి రావాలని నిర్ణయించుకున్న కొద్ది రోజులకే ఆయన మరణించడం మిస్టరీగా ఉందని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని రౌత్ డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఇవన్నీ నిరాధారమైనవని, ఒకరి మరణంపై రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూడటం దారుణమని బీజేపీ ఎమ్మెల్సీ చిత్ర వాఘ్ విమర్శించారు. అజిత్ పవార్‌పై పాలక కూటమి నుంచి ఎలాంటి ఒత్తిడి లేదని ఆమె స్పష్టం చేశారు. కాగా, అజిత్ పవార్ బీజేపీని వీడటానికి సిద్ధమైన కొద్ది రోజులకే ఈ ప్రమాదం జరిగిందంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తొలుత అనుమానాలు వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

# సిమ్లాకు వెళ్తారా.. మీకో గుడ్ న్యూస్!

**హోమ్‌స్టేల రిజిస్ట్రేషన్ కోసం**

**ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్ ప్రారంభం**



సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో పర్యటించాలని ప్లాన్ చేస్తున్న వారికి ఇది శుభవార్త. పర్యాటకులకు మరింత మెరుగైన, విభిన్నమైన అనుభూతిని అందించే లక్ష్యంతో అక్కడి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యంగా, హోమ్‌స్టేల ఏర్పాటును ప్రోత్సహించడం ద్వారా టూరిస్టులకు స్థానిక సంస్కృతిని, వంటకాలను దగ్గర చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు సోమవారం ప్రత్యేకంగా హోమ్‌స్టేల కోసం రూపొందించిన ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ కొత్త పోర్టల్ ద్వారా హోమ్‌స్టే యజమానులు ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభంగా పూర్తి చేసుకోవచ్చు. దీనివల్ల అధికారిక అడ్డంకులు తగ్గి, మరిన్ని కొత్త హోమ్‌స్టేలు అందుబాటులోకి రానున్నాయి. ఫైర్ డిపార్ట్‌మెంట్ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ లేదన్న కారణంతో రిజిస్ట్రేషన్ల పునరుద్ధరణను నిలిపివేయవద్దని సీఎం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తాత్కాలిక రిజిస్ట్రేషన్లు మంజూరు చేయాలని, తద్వారా యజమానులకు ఎలాంటి వేధింపులు లేకుండా చూడాలని సూచించారు. గ్రామీణ పర్యాటకాన్ని ప్రోత్సహించడం, మారుమూల ప్రాంతాలకు సైతం టూరిస్టులను ఆకర్షించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని సీఎం సుఖు తెలిపారు. ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లో కూడా ఆరు గదుల వరకు హోమ్‌స్టేలను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు ఇస్తున్నారు. సంప్రదాయ గ్రామ వాస్తుశైలి, స్థానిక వంటకాలతో కూడిన హోమ్‌స్టేలు పర్యాటకులకు, ముఖ్యంగా విదేశీయులకు ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తాయని ఆయన అన్నారు. ఈ రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు టూరిజం యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం వడ్డీ రాయితీ పథకాన్ని కూడా అమలు చేస్తోంది. ఈ మార్పుల వల్ల హిమాచల్ వెళ్లే పర్యాటకులకు బస కోసం మరిన్ని ఆప్షన్లు దొరకడమే కాకుండా, స్థానిక జీవనశైలిని దగ్గరగా చూసే అవకాశం కలుగుతుంది.

## భారీ లాభాలతో ముగిసిన సూచీలు

ముంబై: బడ్జెట్ రోజున భారీగా పతనమైన దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం ట్రేడింగ్‌లో బలంగా పుంజుకున్నాయి. ట్రేడింగ్ చివరి గంటలో హెవీవెయిట్ షేర్లలో అనూహ్యంగా కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 944 పాయింట్లు పెరిగి 81,666 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 263 పాయింట్లు లాభపడి 25,088 వద్ద ముగిసింది. ఇవాళ్టి ట్రేడింగ్‌లో సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఒక దశలో 80,387 కనిష్ఠ స్థాయికి పడిపోయిన సెన్సెక్స్, ఆ తర్వాత 1,345 పాయింట్లు పుంజుకుని 81,732 గరిష్ఠాన్ని తాకింది. నిఫ్టీ కూడా 24,679 కనిష్ఠ స్థాయి నుంచి కోలుకుని 25,108 స్థాయికి చేరింది. అదానీ పోర్ట్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఎల్‌డటీ, మహీంద్రా ఓ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి ప్రధాన షేర్లలో చివరి గంటలో కొనుగోళ్లు వెల్లువెత్తాయి. 2020 తర్వాత బడ్జెట్ రోజున మార్కెట్లు అత్యంత దారుణంగా పతనం కాగా, ఒక్కరోజులోనే ఈ రికవరీ చోటుచేసుకోవడం గమనార్హం. మార్కెట్లలో భయాన్ని సూచించే ఇండియా ఎ×శ సూచీ 8 శాతం తగ్గింది. పవర్‌గ్రిడ్ షేరు 7.6 శాతం లాభంతో సెన్సెక్స్‌లో టాప్ గెయినర్‌గా నిలిచింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా లాభాలతో ముగిశాయి. ఆటో, మెటల్, రియల్టీ రంగాలు లాభపడగా, ఐటీ రంగం స్వల్పంగా నష్టపోయింది. మరోవైపు కమోడిటీ మార్కెట్‌లో వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. ఎంసీఎక్స్ సిల్వర్ ఫ్యూచర్స్ ధర 6.4 శాతం తగ్గి కిలో రూ.2,48,600కి చేరింది. బంగారం ధరలు మాత్రం దాదాపు స్థిరంగా ఉన్నాయి.

## ఐరోపా ఆర్మీ ప్రమాదకరం

**ఈయూ ఫారిన్ పాలసీ చీఫ్ ఆందోళన**

లండన్: యూరోపియన్ ఆర్మీ ఏర్పాటు అంశంపై ఈయూ ఫారిన్ పాలసీ చీఫ్ కాజా కల్లాస్ స్పందించారు. గ్రీన్‌లాండ్ అంశంలో అమెరికా, యూరోపియన్ యూనియన్ మధ్య విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో యూరోపియన్ ఆర్మీ అంశంపై చర్చ సాగుతోంది. అయితే, యూరోపియన్ ఆర్మీ ఏర్పాటు చాలా ప్రమాదకరమని ఈయూ ఫారిన్ పాలసీ చీఫ్ హెచ్చరించారు. యూరోపియన్ ఆర్మీ అవసరమని చెప్పేవారు ప్రాక్టికల్‌గా ఆలోచించి ఉండరని వ్యాఖ్యానించారు. యూరప్ దేశాలు ఇప్పటికే నాటోలో ఉన్న నేపథ్యంలో, ఒక ప్రత్యేక సైన్యాన్ని సృష్టించలేరని అన్నారు. యుద్ధం వంటి సంక్షోభ సమయాల్లో ఎవరు ఎవరికి ఆదేశాలు జారీ చేస్తారనేది ముఖ్యమైన అంశమని అన్నారు. ఒకవేళ నాటో, యూరోపియన్ ఆర్మీ రెండూ ఉంటే అప్పుడు పరిస్థితి గందరగోళంగా మారుతుందని అన్నారు. ఇది అత్యంత ప్రమాదకరమని వ్యాఖ్యానించారు.

## అవి డబ్బా ఇంజిన్లు.. టీవీకేనే టాప్ ఇంజిన్

**బీజేపీపై విజయ్ సెటైర్లు**

చెన్నై: బీజేపీ, డీఎంకే పార్టీలు డబ్బా ఇంజిన్, రిపేర్ ఇంజిన్‌లు అయితే తమ పార్టీ మాత్రమే టాప్ ఇంజిన్ అని టీవీకే పార్టీ అధ్యక్షుడు, ప్రముఖ తమిళ నటుడు విజయ్ అన్నారు. తమిళగ వెట్రి కజగం (టీవీకే) మూడవ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ టాప్ ఇంజిన్‌తో ఆ పార్టీలకు పోలిక లేదని అన్నారు. తమ పార్టీ తమిళ ప్రజల కన్నీళ్లు తుడుస్తుందని, వారి కష్టాలను తీరుస్తుందని అన్నారు. తమిళనాడులో బీజేపీ కొన్ని పార్టీలతో కూటమిగా కొనసాగుతోందని విమర్శించారు. డీఎంకేను, వివిధ పార్టీలతో కూడిన కూటమిని ఓడించడం టీవీకే పార్టీకి మాత్రమే సాధ్యమని ఆయన అన్నారు. డీఎంకే ఒంటరిగా పోటీ చేసినా, కూటమిగా వచ్చినా ఎదుర్కొనే సత్తా టీవీకేకు ఉందని అన్నారు. తమిళనాడులో డీఎంకే తమ రాజకీయ ప్రత్యర్థి అని ఆయన స్పష్టం చేశారు. నాడు ప్రజల కన్నీళ్లు తుడిచేందుకు ఎంజీఆర్ ఏఐఏడీఎంకేను స్థాపించారని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిచిన అనంతరం కూడా నాడు ఎంజీఆర్‌ను అవమానించారని గుర్తు చేశారు. అలా కొంతమంది చేస్తారని విమర్శించారు. తాము డీఎంకేను ప్రశ్నిస్తాం, వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. టీవీకేకు ఒంటరిగా పోటీ చేసి గెలిచే సత్తా ఉందని అన్నారు. కాగా, టీవీకే పార్టీ ఆవిర్భవించి మూడు సంవత్సరాలు పూర్తి చేసుకుంది. త్వరలో తన మొదటి ఎన్నికలను ఎదుర్కోవడానికి సిద్ధమవుతోంది.

## ట్రంప్ ట్రూత్‌లో ‘ఇండియా గేట్’

**అందంగా ఉంటుందంటూ కామెంట్**



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, న్యూఢిల్లీలోని ప్రఖ్యాత ఇండియా గేట్ చిత్రాన్ని తన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ‘ట్రూత్ సోషల్’లో పోస్ట్ చేశారు. భారత చారిత్రక కట్టడాన్ని ప్రశంసిస్తూనే, “భారతదేశం యొక్క అందమైన విజయ స్తంభం, మాది అందరికంటే గొప్పదిగా ఉంటుంది” అని తనదైన శైలిలో ఓ వ్యాఖ్యను జోడించారు. సోమవారం చేసిన ఈ పోస్ట్ వెనుక ఓ పెద్ద ప్రణాళిక ఉన్నట్లు స్పష్టమవుతోంది. అమెరికా స్వాతంత్ర్యం సిద్ధించి 250 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా వాషింగ్టన్ డీసీలో ఓ భారీ విజయ ద్వారం నిర్మించాలనేది ట్రంప్ ప్రతిపాదన. ‘ఇండిపెండెన్స్ ఆర్చ్’గా పిలుస్తున్న ఈ నిర్మాణంతో తన ప్రణాళికను మరోసారి ఆయన తెరపైకి తెచ్చారు. “250 ఏళ్ల స్వాతంత్ర్యానికి గుర్తుగా 250 అడుగుల ఎత్తు” అనే నినాదంతో దీన్ని నిర్మించాలని ఆయన భావిస్తున్నారు. ఈ ఆర్చ్ పూర్తయితే, అమెరికా రాజధానిలోని వైట్ హౌస్ (70 అడుగులు), లింకన్ మెమోరియల్ (100 అడుగులు) కంటే ఎంతో ఎత్తుగా ఉంటుంది. ప్రపంచంలోని ప్రఖ్యాత కట్టడాలతో పోలుస్తూ, పారిస్‌లోని ఆర్క్ డి ట్రయంఫ్ (164 అడుగులు), మెక్సికో సిటీలోని ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్చ్ (220 అడుగులు) కన్నా కూడా తన ఆర్చ్ పెద్దదిగా ఉండాలని ట్రంప్ పేర్కొన్నారు. కాగా, ఇండియా గేట్ ఎత్తు 138 అడుగులు. మొదటి ప్రపంచ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన భారత సైనికుల స్మారకార్థం దీన్ని నిర్మించారు. అయితే, ట్రంప్ ప్రతిపాదిస్తున్న ఈ భారీ ప్రాజెక్టుకు ఇంకా అధికారిక డిజైన్లు ఖరారు కాలేదని, నిర్మాణ అనుమతులు కూడా లభించలేదని తెలుస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక నిర్మాణం కార్యరూపం దాల్చడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది.

## దలైలామాకు గ్రామీ అవార్డు

న్యూఢిల్లీ: టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా ప్రతిష్ఠాత్మక గ్రామీ అవార్డు గెలుచుకున్నారు. బెస్ట్ ఆడియో బుక్, నెరేషన్ అండ్ స్టోరీ టెల్లింగ్ రికార్డింగ్ జాబితాలో ఆయన ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. 90 ఏళ్ల వయస్సులో ‘మెడిటేషన్’ అనే ఆల్బమ్‌కు గాను దలైలామాను ఈ అవార్డు వరించింది. దలైలామాకు గ్రామీ అవార్డు ఇవ్వడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. దీనిని ఉపయోగించుకుని చైనా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంది. దలైలామా పూర్తిగా ఆధ్యాత్మికపరమైన వ్యక్తి కాదని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ ఓ మీడియా సమావేశంలో అన్నారు. మతం ముసుగులో చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలకు పాల్పడుతున్న రాజకీయ ప్రవాసి అని ఆయనపై ఆరోపణలు గుప్పించారు. ఈ అవార్డును బీజింగ్ వ్యతిరేక కార్యకలాపాలకు ఒక సాధనంగా ఉపయోగించుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. దలైలామా మతం ముసుగులో చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలను ప్రోత్సహించే వ్యక్తి అన్నారు. తనకు గ్రామీ అవార్డు రావడంపై దలైలామా స్పందించారు. ఇది తన వ్యక్తిగత విజయంగా చూడటం లేదని అన్నారు. శాంతి, కరుణ, పర్యావరణంపై శ్రద్ధ, మానవత్వం అనేవి మానవాళి శ్రేయస్సుకు అవసరమని పేర్కొన్నారు. గ్రామీ గుర్తింపు ఈ సందేశాలను మరింత విస్తృతంగా వ్యాప్తి చేయడంలో సహాయపడుతుందని విశ్వసిస్తున్నానని పేర్కొన్నారు.

## బంగారం, వెండి భారీ పతనం

**తులం బంగారంపై ఒక్కరోజే రూ.9,050 పతనం**

**కిలో వెండిపై ఏకంగా రూ.50,000 తగ్గుదల**

న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయికి చేరిన తర్వాత, గత నాలుగైదు రోజులుగా పసిడి, వెండి ధరలు నేలచూస్తున్నాయి. ఈ క్రమంలో ఇవాళ ఒక్కరోజే బంగారం ధర రికార్డు స్థాయిలో పడిపోయింది. ఈ పరిణామం పెట్టుబడిదారులకు షాక్ ఇవ్వగా, కొనుగోలుదారులకు ఊరటనిచ్చింది. ఈరోజు (ఫిబ్రవరి 2) ఉదయం 9:30 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.9,050 తగ్గి రూ.1,51,530కి చేరింది. అలాగే, 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.8,300 తగ్గి రూ.1,38,900 వద్ద ట్రేడ్ అవుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో కూడా దాదాపు ఇదే పరిస్థితి కొనసాగుతోంది. అక్కడ 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,51,680గా నమోదైంది. బంగారం బాటలోనే వెండి కూడా పయనిస్తోంది. కిలో వెండి ధర నిన్నటితో పోలిస్తే ఏకంగా రూ.50,000 పతనమైంది. ప్రస్తుతం హైదరాబాద్, ఢిల్లీ మార్కెట్లలో కిలో వెండి ధర రూ.3 లక్షల వద్ద ఉంది. కొద్ది రోజుల క్రితం కిలో వెండి ధర రూ.4.25 లక్షల వరకు చేరడం గమనార్హం. ఇటీవల రికార్డు గరిష్ఠాలకు చేరడంతో పెట్టుబడిదారులు భారీ ఎత్తున లాభాల స్వీకరణకు (ప్రాఫిట్ బుకింగ్) మొగ్గు చూపడమే ఈ పతనానికి ప్రధాన కారణంగా బులియన్ మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ధరల పతనం పెట్టుబడిదారులను ఆందోళనకు గురిచేస్తుండగా, కొనుగోలు చేయాలనుకునే వారికి ఊరటనిస్తోంది.

వయ్యారి చిత్రం






## అల్లు-అట్లీ మూవీలో దివ్యభారతి?

ఇండస్ట్రీలోకి యంగ్ బ్యూటీగా అడుగుపెట్టిన దివ్యభారతి ప్రస్తుతం జబర్దస్త్ కమెడియన్ సుడిగాలి సుదీర్ హీరోగా నటిస్తున్న గోట్ అనే సినిమా ద్వారా తెలుగు తెరకు పరిచయం కాబోతోంది. అయితే ఈమెకు పెద్దగా గుర్తింపు లేదు కానీ మొదటిసారి ఈమె అల్లు అర్జున్ తో కలిసి దిగిన ఒక ఫోటో నెట్టింట వైరల్ అవ్వడంతో ఈ దివ్య భారతి కాస్త ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్ గా మారింది. పైగా అల్లు అర్జున్ - అట్లీ కాంబినేషన్లో వస్తున్న ఏ22-ఏ6 మూవీలో ఈమెకు అవకాశం లభించిందని.. అందుకే అల్లు అర్జున్ తో కలిసి ఫోటో దిగింది అంటూ నెట్టింట చర్చ జోరుగా మొదలైంది. ఇప్పటికే ఈ సినిమాలో దీపికా పదుకొనే హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. పైగా జాన్వీ కపూర్, మృణాల్ ఠాగూర్, రష్మిక మందన్నా లాంటి హీరోయిన్స్ నటిస్తున్నారు అంటూ వార్తలు వినిపిస్తున్నాయి.. దీనికి తోడు ఇప్పుడు కొత్త హీరోయిన్లను కూడా ఈ సినిమాలో తీసుకోబోతున్నారు అంటూ వార్తలు రాగా.. అదే సమయంలో అల్లు అర్జున్ తో కలిసి దివ్యభారతి షేర్ చేసిన ఫోటో కొత్త అనుమానాలకు దారితీసింది. దీంతో ఈమె కాస్త ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. అలా బలమైన పాత్ర పడకపోయినా సెలబ్రిటీలతో ఫోటోలు దిగి నెట్టింట షేర్ చేసిన చాలు వైరల్ అయిపోతామని నిరూపించింది ఈ ముద్దుగుమ్మ.




## ధనుష్‌తో సాయిపల్లవి మరోసారి..!

### ధనుష్ 55వ చిత్రంలో హీరోయిన్‌గా ఎంపిక

స్టార్ హీరో ధనుష్ కథానాయకుడిగా, దర్శకుడు రాజ్‌కుమార్ పెరియస్వామి రూపొందిస్తున్న భారీ చిత్రంలో ప్రముఖ నటి సాయి పల్లవి హీరోయిన్‌గా ఎంపికైంది. సోమవారం చిత్ర నిర్మాణ సంస్థ వండర్‌బార్ ఫిల్మ్స్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. గతంలో బాలాజీ మోహన్ దర్శకత్వంలో వచ్చిన 'మారి 2'లో ధనుష్, సాయి పల్లవి జోడీకి మంచి మార్కులు పడ్డాయి. ఇప్పుడు మళ్లీ ఈ హిట్ కాంబో రిపీట్ కానుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ధనుష్ నిర్మాణ సంస్థ వండర్‌బార్ ఫిలింస్, ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న సంస్థల్లో ఒకటి. తమ ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా సాయి పల్లవికి స్వాగతం పలుకుతూ, 'ఆమె అందం, శక్తి రెండింటి కలబోత. అందరి ఫేవరెట్ సాయి పల్లవికి 'డీ55' టీంలోకి స్వాగతం. హిట్ కాంబో మళ్లీ వెండితెరపైకి వస్తోంది' అని పోస్ట్ చేసింది.

## రణబాలి సెన్సేషన్.. టీం హ్యాపీ

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా జంటగా మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ 'రణబాలి' సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్‌కు రాబోతోంది. ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నా ఈ చిత్రం నుంచి ఇటీవల రిలీజ్ చేసిన టైటిల్ గ్లింప్స్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వస్తోంది. ఇప్పటికే 15 మిలియన్ ప్లస్ వ్యూస్‌తో 'రణబాలి' టైటిల్ గ్లింప్స్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ సినిమా సాధించబోయే సక్సెస్‌కు టైటిల్ గ్లింప్స్‌కు వస్తున్న స్పందనే ఫస్ట్ స్టెప్‌గా మూవీ టీమ్ భావిస్తూ సోషల్ మీడియా వేదికగా ఓ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఇక ఈ గ్లింప్స్‌లో విజయ్ దేవరకొండ రణబాలి అనే యోధుడి పాత్రలో కనిపించి ఫ్యాన్స్‌ను మెస్మరైజ్ చేశాడు. జయమ్మగా రష్మిక మందన్నా ఆకర్షించింది. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా 'రణబాలి' రూపొందుతోంది.






## విజయ్-రష్మిక పెళ్లి ఫిబ్రవరి 26న?

రష్మిక మందన్నా - విజయ్ దేవరకొండ పెళ్లి ఫిబ్రవరి 2నే అని వార్తలు గుప్పుమన్నా, జరగనట్లే తెలుస్తోంది. అయితే, ఇప్పుడు మరో కొత్త తేది చక్కర్లు కొడుతోంది. ఫిబ్రవరి 26న వీరి వివాహం జరగబోతోంది అంటూ వార్తలు వినిపిస్తున్నాయి. మొత్తానికైతే ఫిబ్రవరి 2న వివాహం అంటూ వచ్చిన వార్తలలో నిజం లేదు కానీ ఒకవేళ ఫిబ్రవరి 26న వీరి వివాహం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయట. మరి దీనిపై ఈ జంట స్వయంగా ప్రకటిస్తారా లేక 26న వివాహం చేసుకోబోతున్నారా? అన్న విషయం తెలియాలి.

## హీరోయిన్ అని బ్రేకప్ చెప్పాడు

స్టార్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ తాజాగా నటించిన బాలీవుడ్ చిత్రం 'దో దీవానే శహర్ మే' మరో రెండు వారాల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో ఆమె ఇచ్చిన ఓ ఇంటర్వ్యూ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ముఖ్యంగా తన మాజీ ప్రేమ వ్యవహారం గురించి మృణాల్ చేసిన వ్యాఖ్యలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇంటర్వ్యూలో మాట్లాడిన మృణాల్ తన గత రిలేషన్‌షిప్ గురించి ఓపెన్‌గా స్పందించారు. "నేను సినిమాల్లోకి రావడం అతనికి అస్సలు నచ్చలేదు. నేను చాలా దూకుడుగా ఉంటానని, నాతో లైఫ్ కొనసాగించలేనని చెప్పి బ్రేకప్ చెప్పాడు. అయితే అతను బ్రేకప్ చెప్పినందుకు నేను బాధపడలేదు. కానీ అతని ఆలోచనా విధానంపై మాత్రం జాలి వేసింది. అలాంటి మనస్తత్వం ఉన్న వ్యక్తితో బంధం కొనసాగించడం కష్టమే" అని పేర్కొన్నారు. అంతేకాకుండా ఇలాంటి మైండ్‌సెట్ ఉన్న వాళ్లతో ఉంటే భవిష్యత్తులో పిల్లలు కూడా అదే విధమైన ఆలోచనలతో పెరుగుతారు. అది నాకు అస్సలు ఇష్టం లేదు. అందుకే విడిపోవడం మంచిదని భావించాను అంటూ తన నిర్ణయానికి కారణాలు వివరించారు.





## జైలర్ 2లో షారుక్ ఖాన్?

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ కాంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ క్రేజీ సీక్వెల్ జైలర్ 2. ఈ సినిమాలో బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నాడని అప్‌డేట్ కూడా వచ్చింది. కాగా దీనిపై అఫీషియల్ న్యూస్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. జైలర్ 2 నెక్ట్స్ షెడ్యూల్ ముంబైలో జరుగనుంది. తాజా సమాచారం ప్రకారం వచ్చే వారం షురూ కానున్న ఈ షెడ్యూల్‌లో షారుక్ జాయిన్ అవ్వబోతున్నాడు. ఈ షెడ్యూల్‌లో షారుక్‌ఖాన్‌పై వచ్చే కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. మొత్తానికి నెల్సన్ దిలీప్ కుమార్ షారుక్ ఖాన్‌ను ఎలాంటి స్పెషల్ రోల్‌లో చూపించబోతున్నాడు.. తలైవా, షారుక్ ఖాన్ కాంబోలో సీన్లుంటాయా..? అన్నది తెలియాల్సి ఉంది.


## మ్యాడ్ జూనియర్స్‌గా.. మ్యాడ్3

టాలీవుడ్‌లో యూత్‌ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌లుగా భారీ విజయాలను అందుకున్న 'మ్యాడ్', 'మ్యాడ్ 2' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్లుగా నిలిచిన విషయం తెలిసిందే. దర్శకుడు కళ్యాణ్ శంకర్ తెరకెక్కించిన ఈ రెండు చిత్రాలు యువతను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఫన్, ఫ్రెండ్‌షిప్, కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌తో సాగిన ఈ సిరీస్‌కు ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడింది. నార్నె నవీన్, రామ్ నితిన్, సంగీత్ శోభన్ హీరోలుగా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఈ సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీకి కొనసాగింపుగా 'మ్యాడ్ 3' ను తెరపైకి తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించిన నిర్మాతలు, ఈసారి కొత్త కాన్సెప్ట్‌తో పాటు కొత్త కాస్టింగ్‌ను కూడా పరిచయం చేయాలని భావిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. గత చిత్రాల్లో కనిపించిన హీరోల స్థానంలో ఈసారి కొత్త యువ నటులను తీసుకొస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త కాస్టింగ్‌లో భాగంగా 'లిటిల్ హార్ట్స్' ఫేమ్ జేయ్ కృష్ణ, 'కోర్ట్' ఫేమ్ హర్ష్ రోషన్ పేర్లు వినిపిస్తున్నాయి. యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహిస్తూ ఫ్రెష్ ఫేస్‌లతో ఈ చిత్రాన్ని రూపొందించాలన్న ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో సినిమాకు 'మ్యాడ్ జూనియర్స్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు ఫిల్మ్‌నగర్‌లో ప్రచారం జరుగుతోంది. టైటిల్ ద్వారా కూడా ఈ చిత్రం కొత్త తరం యువత కథగా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది.



## భార్యనని కోర్టుకు లాగాడు

అలనాటి అందాల నటి, సహజనటి జయప్రద తన సినీ జీవితంలో ఎదుర్కొన్న ఓ భయంకరమైన అనుభవాన్ని తాజాగా 'ప్రేమ ది జర్నలిస్ట్' ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఓ స్టాకర్ తనను భార్యగా ఊహించుకుని, మానసిక నరకం చూపించాడని, ఆ వేధింపుల నుంచి సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ తనను కాపాడారని ఆమె వెల్లడించారు. ఈ సంఘటన తన జీవితంలో మరిచిపోలేని పీడకల అని ఆమె అభివర్ణించారు. జయప్రద కథనం ప్రకారం, ఓ వ్యక్తి ఆమెపై తీవ్రమైన వ్యామోహం పెంచుకున్నాడు. కేవలం అభిమానంతో ఆగకుండా, జయప్రద తన భార్య అని, ఆమె తల్లిదండ్రులు తనను కలవకుండా అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ ఏకంగా కోర్టులో కేసు వేశాడు. ఈ పరిణామంతో తాను, తన కుటుంబం తీవ్ర వేదనకు గురయ్యామని జయప్రద తెలిపారు. 'ఆ వ్యక్తి నా తండ్రి, తమ్ముడిని కోర్టుకు లాగాడు. నా భార్యను నా దగ్గరకు రాకుండా అడ్డుకుంటున్నారని కేసు పెట్టాడు. ఆ సమయంలో ఏం చేయాలో తెలియక నిస్సహాయంగా ఏడ్చేదాన్ని' అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ సమయంలో జడ్జి 'ఏ జయప్రద గురించి మాట్లాడుతున్నావు?' అని ప్రశ్నించగా, ఆమె శరీరంలో పుట్టుమచ్చలు ఎక్కడున్నాయో కూడా తనకు తెలుసంటూ ఆ స్టాకర్ చెప్పిన మాటలు తనను దిగ్భ్రాంతికి గురిచేశాయని గుర్తుచేసుకున్నారు.





# టీ20 వరల్డ్ కప్‌కు పోటీగా బంగ్లా ఒడొమ్మో!

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ నుంచి తప్పుకున్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ).. మెగా టోర్నీకి ప్రతీకారంగా ఫ్రాంచైజీ తరహా టీ20 టోర్నీ నిర్వహించేందుకు సిద్ధమైంది. టీ20 ప్రపంచకప్ మిస్ అవుతున్న తమ ఆటగాళ్లు, ప్రేక్షకుల కోసం బీసీబీ ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఈ టోర్నీకి 'ఒడొమ్మో బంగ్లాదేశ్' పేరు పెట్టింది. ప్రపంచకప్ ఆడలేకపోతున్న తమ దేశ ఆటగాళ్లకు ప్రాక్టీస్ కల్పించడం, నిరాశలో ఉన్న ప్రేక్షకులను అలరించడానికి ఈ లీగ్‌ను నిర్వహించేందుకు బీసీసీఐ ముందుకొచ్చింది. ఒడొమ్మో బంగ్లాదేశ్ అంటే అణచలేని, అజేయమైన బంగ్లాదేశ్ అని అర్థం. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ జరిగే సమయంలోనే ఈ లీగ్ జరగనుంది. బంగ్లాదేశ్ జాతీయ జట్టు ఆటగాళ్లతో పాటు దేశవాళీ ప్లేయర్లతో ఈ లీగ్ నిర్వహించనున్నారు. ఇప్పటికే బంగ్లాదేశ్ ఆటగాళ్లను మూడు జట్లుగా విభజించారు. ఈ టోర్నీ కోసం మొత్తం 2.5 కోట్ల టాకాలు (బంగ్లాదేశ్ కరెన్సీ) ప్రైజ్ మనీ, ప్లేయర్ ఫీజుల రూపంలో కేటాయించారు. అన్ని మ్యాచ్‌లు మీర్పూర్‌లోని షేర్-ఏ-బంగ్లా నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఫ్లడ్ లైట్ల వెలుతురులో జరుగుతాయి. ఫిబ్రవరి 5, 6 మరియు 7 తేదీల్లో లీగ్ మ్యాచ్‌లు జరగనుండగా.. ఫిబ్రవరి 9న నిర్వహించనున్నారు.




# జియోస్టార్‌కు 4,500 కోట్లు లాస్!



భారత్‌తో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నామని పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. మెగా టోర్నీలో ఆడేందుకు పాకిస్థాన్ క్రికెట్ టీమ్‌ను అనుమతిచ్చిన ఆ దేశ ప్రభుత్వం.. భారత్‌తో ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరించాలని సూచించింది. దాంతో ఐసీసీ తీవ్రంగా స్పందించింది. ఇది కేవలం రాజకీయ అంశం కాదని, దీని వెనుక భారీ ఆర్థిక లెక్కలున్నాయని హెచ్చరిస్తూ ఓ ప్రకటనను విడుదల చేసింది. ఇది కేవలం ఒక క్రీడా ఘట్టం కాదని, యావత్ టోర్నమెంట్‌కు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచే అంశమని, ప్రసార హక్కుల విలువను నిర్దేశించే, చిన్న దేశాల క్రికెట్ బోర్డులకు నిధులు సమకూర్చే ఈ మ్యాచ్‌ను నిర్వహించడం ఐసీసీకి అత్యంత కీలకమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భారత్-పాకిస్థాన్ మధ్య జరిగే ఒక టీ20 మ్యాచ్ విలువ అక్షరాలా 500 మిలియన్ డాలర్లు (సుమారు రూ.4,500 కోట్లు) అంట. బ్రాడ్‌కాస్టింగ్ రైట్స్, యాడ్స్ రెవెన్యూ, స్పాన్సర్‌షిప్, టికెటింగ్, బెట్టింగ్ వంటి అన్ని వాణిజ్య కార్యకలాపాలను కలిపితే ఈ స్థాయిలో ఆదాయం సమకూరుతుందని బిజినెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రపంచ క్రికెట్‌లో మరే మ్యాచ్‌కూ ఇంతటి ఆర్థిక విలువ లేదంట. ప్రసారకర్తలకు ఈ మ్యాచ్ ఒక బంగారు బాతు లాంటిదని, ఈ మ్యాచ్ సమయంలో 10 సెకన్ల యాడ్ స్లాట్‌కు రూ. 25 లక్షల నుంచి రూ. 40 లక్షలు వసూలు చేస్తారని, ఒకవేళ ఈ మ్యాచ్ రద్దయితే, టోర్నీ ఆర్థిక స్వరూపమే మారిపోతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఐసీసీ ఆంక్షలకు భయపడం


ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇది ఈ ఒక్క మ్యాచ్‌తోనే ఆగిపోదని, భవిష్యత్తులో కూడా భారత్‌తో జరిగే మ్యాచ్‌లను పాకిస్థాన్ బహిష్కరిస్తుందని ఆ జట్టు మాజీ కెప్టెన్ రషీద్ లతీఫ్ అన్నాడు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ ఆదివారం తెరలేవనుంది. గ్రూప్-ఏలో భాగంగా ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా భారత్, పాకిస్థాన్ మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే ఈ మ్యాచ్‌ను బాయ్‌కట్ చేస్తున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. తాజాగా ఈ వ్యవహారంపై మాట్లాడిన రషీద్ లతీఫ్.. ఐసీసీ ఎన్ని ఆంక్షలు విధించినా పీసీబీ భయపడబోదని స్పష్టం చేశాడు. భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌ల నుంచి ఐసీసీ, ఆసియా క్రికెట్ కౌన్సిల్ భారీ లాభాలను ఆర్జిస్తున్నాయి. రాబోయే మూడేళ్లలో ఉమ్మడి వేదికగా మ్యాచ్‌లు ఆడేందుకు ఇరు దేశాల క్రికెట్ బోర్డులు ఒప్పందం కుదుర్చుకున్నాయి. అంతా సవ్యంగా సాగుతున్న క్రమంలో బంగ్లాదేశ్ జట్టు టీ20 ప్రపంచకప్ నుంచి తప్పుకుంది. దాంతో పరిస్థితులన్నీ పూర్తిగా మారిపోయాయి. భద్రతా కారణాలతో బంగ్లాదేశ్ భారత్ రావడానికి నిరాకరించినప్పుడు ఐసీసీ తేలికగా తీసుకుంది. కానీ ఇప్పుడు రాజకీయ వాతావరణం మారిపోయింది. గతంలోలా కాకుండా బంగ్లాదేశ్‌కు పాకిస్థాన్ అండగా నిలుస్తోంది.

# ఆడలేక మద్దెల ఓడు



**పాక్‌పై డానిష్ కనేరియా ఫైర్**

ఆడలేక మద్దెల ఓడు అనే సామెత పాకిస్థాన్ జట్టుకు సరిగ్గా సరిపోతుందని ఆ జట్టు మాజీ స్పిన్నర్ డానిష్ కనేరియా అభిప్రాయపడ్డాడు. భారత్‌ను ఓడించే సత్తా లేక బాయ్‌కట్ అనే డ్రామా ఎత్తుకుందని మండిపడ్డాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరించాలన్న పాకిస్థాన్ నిర్ణయంపై సరికాదన్నాడు. ఈ అనాలోచిత నిర్ణయం కారణంగా పాకిస్థాన్ క్రికెట్‌కే ఎక్కువ నష్టం జరుగుతుందని, టీమిండియాను ఎదుర్కోవడానికి పాక్ భయపడుతోందనే తప్పుడు సంకేతాలు ప్రపంచానికి వెళతాయని తెలిపాడు. ఓ వార్తా సంస్థతో మాట్లాడిన కనేరియా.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డుపై విరుచుకుపడ్డాడు. 'ఈ నిర్ణయంలో ఎలాంటి హేతుబద్ధత లేదన్నాడు. భారత్‌లో పర్యటించబోమని గతంలోనే పాకిస్థాన్ చెప్పింది. వచ్చే మూడేళ్ల పాటు తటస్థ వేదికగా ఆడేలా ఇరు దేశాల క్రికెట్ బోర్డులు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. దాంతోనే పాకిస్థాన్ మ్యాచ్‌లను శ్రీలంకలో ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఈ మ్యాచ్‌ను బహిష్కరించడంలో అర్థం లేదు. ఈ అనాలోచిత నిర్ణయంతో పాకిస్థాన్ తమ సెమీఫైనల్ అవకాశాలను మరింత క్లిష్టతరం చేసుకుంది. ప్రస్తుతం భారత్ ఆడుతున్న బ్రాండ్ ఆఫ్ క్రికెట్‌ను చూసి పాకిస్థాన్ భయపడుతోంది. ప్రపంచకప్‌లో ప్రతీసారి భారత్ చేతిలో పాకిస్థాన్ ఓడిపోతూనే ఉంది. ఇప్పుడు తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ప్రపంచకప్ టోర్నీ సెమీస్, ఫైనల్లో భారత్‌తో తలపడాల్సి వస్తే ఏం చేస్తారు? అప్పుడు కూడా ఆడకుండా ట్రోఫీని అప్పగిస్తారా? మైదానంలో పోరాడి గెలిచి ప్రతీకారం తీర్చుకోవాలి కానీ, ఇలా బహిష్కరించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు' అని పీసీబీకి చురకలు అంటించాడు.



# నన్ను ఉగ్రవాదిలా చూశారు: శ్రీశాంత్

టీమిండియా మాజీ పేసర్, వరల్డ్ కప్ విన్నర్ శ్రీశాంత్ తన జీవితంలో ఎదుర్కొన్న అత్యంత కఠినమైన కాలాన్ని గుర్తు చేసుకున్నాడు. 2013 ఐపీఎల్ స్పాట్ ఫిక్సింగ్ ఉదంతంతో తనను ఓ ఉగ్రవాదిలా చూశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఐపీఎల్ 2013 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన శ్రీశాంత్.. స్పాట్ ఫిక్సింగ్ ఆరోపణలతో అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. జట్టులోని అజిత్ చండిలా, అంకిత్ చవాన్‌తో కలిసి శ్రీశాంత్ స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాడని పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. బీసీసీఐ కూడా అతనిపై నిషేధం విధించింది. దాంతో శ్రీశాంత్ కెరీర్ అర్ధంతరంగా ముగిసిపోయింది. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత కోర్టు శ్రీశాంత్‌ను నిర్దోషిగా ప్రకటించింది. కోర్టు క్లీన్ చిట్ ఇచ్చినప్పటికీ, బీసీసీఐ అతనిపై విధించిన జీవితకాల నిషేధాన్ని ఏడేళ్లకు తగ్గించింది. నిషేధం ముగిసిన తర్వాత శ్రీశాంత్ దేశవాళీ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చినా మునపటిలా సత్తా చాటలేకపోయాడు. దాంతో క్రికెట్‌కు వీడ్కోలు పలికి కామెంటేటర్‌గా, విశ్లేషకుడిగా, సినీ నటుడిగా తన రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తున్నాడు. తాజాగా తన సతీమణి భువనేశ్వరి కుమారితో కలిసి ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రీశాంత్.. స్పాట్ ఫిక్సింగ్ ఉదంతాన్ని గుర్తు చేసుకొని భావోద్వేగానికి గురయ్యాడు. నా జీవితంలోనే స్పాట్ ఫిక్సింగ్ ఉదంతాన్ని మరిచిపోలేను. నా వివాహ ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే అరెస్ట్ కావడం అతిపెద్ద విషాదం. 2012లో నాకు ఆరు సర్జరీలు జరిగాయి, నేను వీల్ చైర్‌కే పరిమితమయ్యాను. అదే సమయంలో నాపై ఉగ్రవాది అనే ముద్ర వేశారు' అని గుర్తు చేసుకున్నాడు.

# మీకు మంచిది కాదు: ఐసీసీ

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బహిష్కరించాలని తమ జట్టును ఆదేశించిన పాకిస్థాన్ ప్రభుత్వంపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ చర్య ప్రపంచ క్రీడా నియమాలకు విరుద్ధమని, ఇది పాకిస్థాన్ క్రికెట్‌కు ఏ మాత్రం మంచిది కాదని ఓ ప్రకటనలో హెచ్చరించింది. పాకిస్థాన్ ప్రభుత్వ నిర్ణయం తమ దృష్టికి వచ్చినప్పటికీ, పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) నుంచి అధికారిక సమాచారం కోసం ఇంకా ఎదురుచూస్తున్నాం. టోర్నీలో ఎంపిక చేసిన మ్యాచ్‌ల్లో మాత్రమే ఆడటం అనే పాకిస్థాన్ వైఖరి ఆమోదయోగ్యం కాదు. జాతీయ విధానాలకు సంబంధించిన విషయాల్లో ప్రభుత్వాల పాత్రను గుర్తించి, గౌరవిస్తున్నప్పటికీ.. ఈ నిర్ణయం సరైంది కాదు. ది ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ ఫ్యాన్స్, పాకిస్థాన్‌లోని లక్షలాది మంది అభిమానులకు నిరాశ కలిగించే విషయం. ఈ నిర్ణయం కారణంగా పాకిస్థాన్‌లోని క్రికెట్‌పై చూపే దీర్ఘకాలకి ప్రభావాలను జాగ్రత్తగా పరిశీలించాలని పీసీబీని రిక్వెస్ట్ చేస్తున్నాం.అని ఐసీసీ తమ ప్రకటనలో పేర్కొంది. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఐసీసీ సుతిమెత్తంగా పీసీబీని హెచ్చరించింది.

# భారత్ ఏ తొలి బోణీ

**వామప్ మ్యాచ్‌లో యూఎస్‌ఏపై గెలుపు**

పొట్టి ప్రపంచకప్ వామప్ మ్యాచ్‌లో సంచలనం.. తొమ్మిదో సీజన్‌లో పెద్ద జట్లకు షాకిచ్చిన యూఎస్‌ఏను భారత-ఏ జట్టు అలవోకగా మట్టికరిపించింది. డీవై పాటిల్ మైదానంలో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టి.. 38 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. ఓపెనర్ నారాయన్ జగదీశన్(104) శతకమోతకు, కెప్టెన్ ఆయుష్ బదోనీ(60 నాటౌట్) అర్ధ శతకం తోడవ్వగా భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన భారత్.. తర్వాత ప్రత్యర్థిని రెండొందలకే కట్టడి చేసింది. గత సీజన్‌లో సొంతగడ్డపై చెలరేగిపోయిన యూఎస్‌ఏకు వామప్ మ్యాచ్‌లోనే ఊహించని ఝలక్ ఇచ్చింది భారత ఏ జట్టు. భారీ అంచనాలతో వరల్డ్‌కప్ బరిలో నిలిచిన అమెరికాను పునరాలోచనలో పడేస్తూ.. 38 పరుగుల తేడాతో ఓడించింది.

# ఐసీసీ ప్రొటోకాల్ పాటిస్తాం: బీసీసీఐ

టీ20 వరల్డ్‌కప్‌లో భారత జట్టుతో మ్యాచ్ బాయ్‌కాట్ చేయాలని పాకిస్థాన్ తీసుకున్న నిర్ణయం పెద్ద దుమారం రేపుతోంది. ఎంపిక పద్ధతిన మెగా టోర్నీలో పాక్ జట్టు ఆడాలనుకోవడాన్ని అంతర్జాతీయ క్రికెట్ మండలి తప్పు పడుతోంది. పాక్ ప్రభుత్వం, ఆ దేశ బోర్డు తమ నిర్ణయాన్ని మార్చుకోకుంటే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది కూడా. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి సైతం తమ వైఖరిని స్పష్టంగా వెల్లడించింది. తాము ఐసీసీ నిబంధనలను పాటిస్తామని.. పీసీబీ చీఫ్ మొహ్సిన్ నఖ్వీ మాదిరిగా పూటకో మాట, రోజుకో విధంగా ప్రవర్తించడం తమకు తెలియదని బీసీసీఐ పేర్కొంది. 'వరల్డ్‌కప్‌లో ఫిబ్రవరి15 వ తేదీన లీగ్ దశ మ్యాచ్ కోసం భారత జట్టు శ్రీలంకకు వెళ్తుంది. ఐసీసీ ప్రొటోకాల్.. షెడ్యూల్ ప్రకారం టీమిండియా క్రికెటర్లు సాధన చేస్తారు. మ్యాచ్‌కు ముందు మీడియా సమావేశంలో కూడా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతాడు. మ్యాచ్ సమయానికి భారత బృందం స్టేడియానికి చేరుకుంటుంది. ఒకవేళ పాక్ జట్టు ఆడేందుకు సిద్ధంగా లేదంటే ఆ తర్వాత రిఫరీ నిర్ణయం కోసం మేము ఎదురుచూస్తాం. రిఫరీ మ్యాచ్ రద్దు చేశామని చెప్పాకే స్టేడియం నుంచి బయటకొస్తాం' అని బీసీసీఐ వర్గాలు పేర్కొంటున్నాయి.



# వరల్డ్‌కప్ తొలి దశకు హేజిల్‌వుడ్ దూరం

**ఆస్ట్రేలియాను వేధిస్తున్న గాయాలు**

టీ20 వరల్డ్‌కప్ ప్రారంభానికి ముందే మాజీ ఛాంపియన్ ఆస్ట్రేలియాకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. మెగా టోర్నీ సన్నాహక సిరీస్‌లో పాకిస్థాన్ ధాటికి వైట్‌వాష్‌కు గురైన ఆసీస్‌కు ఇప్పుడు బౌలింగ్ కష్టాలు ఎదుర్కోనుంది. ఇప్పటికే ప్యాట్ కమిన్స్ వెన్ను గాయంతో ఈవెంట్‌కు దూరమవ్వగా.. ప్రధాన పేసర్ జోష్ హేజిల్‌వుడ్ సేవల్ని సైతం ఆ జట్టు కోల్పోనుంది. గాయం కారణంగా వరల్డ్‌కప్ తొలి దశ మ్యాచ్‌లకు ఈ స్పీడ్‌స్టర్ అందుబాటులో ఉండడం లేదు. ఐసీసీ ఈవెంట్లలో ఫేవరెట్‌గా బరిలోకి దిగే ఆస్ట్రేలియా ఈసారి మాత్రం ఆత్మవిశ్వాసంతో కనిపించడం లేదు. నిరుడు స్వదేశంలో భారత జట్టు చేతిలో పొట్టి సిరీస్ కోల్పోయిన కంగారు జట్టు.. సన్నాహక సిరీస్‌లో పాకిస్థాన్ దెబ్బకు కుదేలైంది. పైగా.. మెగా టోర్నీకి ముందే మిచెల్ మార్ష్ సేనకు గాయాలు స్వాగతం పలుకుతున్నాయి. ప్రధాన పేసరైన హేజిల్‌వుడ్ అచిల్లెస్ గాయంతో వరల్డ్‌కప్ ఆరంభ మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. హేజిల్‌వుడ్ వచ్చేంత లోపు సియాన్ అబాట్‌ను ట్రావెల్ రిజర్వ్‌గా స్క్వాడ్‌లోకి తీసుకున్నారు.

ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
మంగళవారం 3-2-2026 | www.evarthalu.com
నేటి ఈవార్తలు

భూమి వాతావరణ వ్యవస్థ మెల్లగా.. కానీ నిరంతరంగా తీవ్రమైన మార్పుల దిశగా ప్రయాణిస్తోంది. పారిశ్రామికీకరణకు ముందు కాలంతో పోలిస్తే భూగోళ సగటు ఉష్ణోగ్రత ఇప్పటికే 1.5 డిగ్రీల సెల్సియస్ అధిక స్థాయికి చేరువైంది. ఈ మార్పు కేవలం గణాంక పరమైన విషయం కాదు. ఇది మానవ జీవన విధానాలపై, ప్రకృతి సమతుల్యంపై, ఆర్థిక వ్యవస్థలపై గాఢమైన ప్రభావాన్ని చూపిస్తున్న సంకేతం. 2050 నాటికి ఈ ప్రభావాలు మరింత తీవ్రమయ్యే అవకాశాలు ఉన్నాయని పలు అంతర్జాతీయ అధ్యయనాలు స్పష్టంగా హెచ్చరిస్తున్నాయి.

**2010 సంవత్సరంలో ప్రపంచ జనాభాలో 1.54 బిలియన్ల మంది అంటే సుమారు 23% మంది మాత్రమే ప్రమాదకరమైన అధిక ఉష్ణోగ్రతలను ఎదుర్కొన్నారు. అయితే శిలాజ ఇంధనాల వినియోగం నియంత్రణ లేకుండా కొనసాగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో 2050 నాటికి ఈ సంఖ్య 3.8 బిలియన్లకు చేరవచ్చని అంచనాలు చెబుతున్నాయి. ఇది ప్రపంచ జనాభాలో దాదాపు 41% భాగాన్ని సూచిస్తుంది. ఈ పెరుగుదల ఒక సహజ ప్రక్రియగా కాకుండా మానవ చర్యల ఫలితంగా రూపుదిద్దుకుంటోంది. తీవ్రమైన వేడి అనేది కొన్ని రోజులు మాత్రమే అధిక ఉష్ణోగ్రతలు నమోదవడం కాదు. 32 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు వరుసగా అనేక రోజుల పాటు కొనసాగడం ద్వారా శరీరంపై తీవ్రమైన ఒత్తిడి ఏర్పడుతుంది. నీటి అవసరం పెరుగుతుంది. పని సామర్థ్యం తగ్గుతుంది.**



వాతావరణ మార్పులను కట్టడిచేయాల్సిన బాధ్యత ఒకే ఒక్క వర్గంపై లేదు. ప్రభుత్వాలు దీర్ఘకాలిక దృష్టితో విధానాలను రూపొందించాలి. పునరుత్పాదక శక్తిపై పెట్టుబడులు పెంచాలి. శిలాజ ఇంధనాలకు ఇచ్చే సబ్సిడీలను తగ్గించాలి. పరిశ్రమలు ఉద్గారాలను తగ్గించే సాంకేతికతలను స్వీకరించాలి. ఆర్థిక సంస్థలు గ్రీన్ ఫైనాన్స్ దిశగా ముందడుగు వేయాలి. పౌరులు తమ వినియోగ విధానాల్లో మార్పు తీసుకురావాలి. భారతదేశం వంటి దేశాల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణమైన అనుసరణ వ్యూహాలు అత్యవసరం. వేడి తట్టుకునే ఇళ్ల నిర్మాణం, పట్టణాల్లో పచ్చదనం పెంపు, నీటి వనరుల సంరక్షణ, రైతులకు వాతావరణ అనుకూల సాగు పద్ధతులపై శిక్షణ ఇవన్నీ తక్షణ చర్యలుగా మారాలి. ఆలస్యం జరిగితే నష్టాలు తిరిగి పూడ్చలేని స్థాయికి చేరుతాయి. 2050 నాటికి వాతావరణ మార్పులు మానవజాతి అస్తిత్వానికే సవాలుగా మారే అవకాశం ఉంది. ఇది భవిష్యత్ తరాల సమస్య మాత్రమే కాదు. ఇది నేటి నిర్ణయాల ఫలితం. ఇప్పుడే సరైన చర్యలు తీసుకుంటేనే భూమిని నివసించదగిన స్థితిలో నిలబెట్టగలుగుతాం. లేకపోతే అధిక ఉష్ణోగ్రతలు, వనరుల కొరత, సామాజిక అస్థిరత మనందరి జీవితాలను కుదిపివేస్తాయి. వాతావరణ మార్పులపై బాధ్యతాయుతమైన చర్యలు తీసుకోవడం మానవజాతి ముందున్న అత్యవసర ధర్మంగా మారింది.

# మండే భూగోళం.. మాడిపోయే జీవం



*వృద్ధులు, పిల్లలు, శారీరకంగా బలహీనులు అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లోకి నెట్టబడతారు. ఈ పరిస్థితి సామాజిక అసమానతలను మరింత లోతుగా చేస్తుంది. 2050 నాటికి అత్యధికంగా ప్రభావితమయ్యే దేశాల జాబితాలో భారతదేశం ముందువరుసలో నిలుస్తోంది. అధిక జనసాంద్రత, వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ, పరిమితమైన మౌలిక వసతులు ఈ ప్రమాదాన్ని మరింత పెంచుతున్నాయి. భారత ఉపఖండంలోని విస్తారమైన ప్రాంతాలు సంవత్సరానికి 3000 కంటే ఎక్కువ శీతలీకరణ డిగ్రీ రోజుల పరిస్థితుల్లోకి వెళ్లే అవకాశం ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అంటే ఏడాది పొడవునా వేడి నుంచి రక్షణ కోసం శక్తి వినియోగం తప్పనిసరి అవుతుంది. ఈ పరిస్థితి విద్య రంగంపై గణనీయమైన ప్రభావం చూపుతుంది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా పాఠశాలలు తరచుగా మూసివేయబడే ప్రమాదం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల లోపం వల్ల పిల్లల చదువు తీవ్రంగా దెబ్బతింటుంది. ఆరోగ్య రంగంలో వేడి సంబంధిత వ్యాధులు గణనీయంగా పెరుగుతాయి. హీట్ స్ట్రోక్, గుండె సంబంధిత సమస్యలు, శ్వాసకోశ వ్యాధులు సాధారణమవుతాయి. ఇప్పటికే ఒత్తిడిలో ఉన్న ప్రజారోగ్య వ్యవస్థపై మరింత భారం పడుతుంది.*

**వ్యవసాయ రంగం వాతావరణ మార్పుల దెబ్బకు అత్యంత సున్నితంగా స్పందించే రంగం. ఉష్ణోగ్రతల పెరుగుదలతో పాటు వర్షపాతం అసమానంగా మారుతుంది. కొన్ని ప్రాంతాల్లో కరవు తీవ్రత పెరుగుతుంది. మరికొన్ని ప్రాంతాల్లో అకస్మాత్తుగా వరదలు సంభవి స్తాయి. 2050 నాటికి ప్రధాన ఆహార పంటల దిగుబడులు 10% నుంచి 25% వరకు తగ్గే ప్రమాదం ఉందని వివిధ అధ్యయనాలు హెచ్చరి స్తున్నాయి. దీనివల్ల ఆహార భద్రత ప్రశ్నార్థకంగా మారుతుంది. ధరలు పెరుగుతాయి. పేద ప్రజలపై ప్రభావం తీవ్రంగా ఉంటుంది. వాతావరణ మార్పుల ప్రభావంతో వలసలు కూడా పెరుగుతాయి. జీవనాధారం కోల్పోయిన రైతులు పట్టణాల వైపు తరలివస్తారు. తీర ప్రాంతాల్లో సముద్ర మట్టం పెరగడం వల్ల కోట్లాది మంది నివాసాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఈ వలసలు సామాజిక ఉద్రిక్తతలకు దారితీయవచ్చు. ఉపాధి అవకాశాలపై ఒత్తిడి పెరుగుతుంది. పట్టణ మౌలిక వసతులు తట్టుకోలేని స్థాయికి చేరవచ్చు. భవిష్యత్తులో అతి శీతల ప్రాంతాలు గణనీయంగా తగ్గిపోతాయని అంచనాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచ జనాభాలో 14% మంది అటువంటి ప్రాంతాల్లో నివసిస్తుండగా 2050 నాటికి ఇది 7%కు పడిపోవచ్చు. ఈ మార్పు ప్రపంచ శక్తి వినియోగ నమూనాలను పూర్తిగా మార్చేస్తుంది. తాపన అవసరాలు తగ్గిన ప్రాంతాల్లో శీతలీకరణ అవసరాలు పెరుగుతాయి. శక్తి డిమాండ్ పెరుగుదలతో కార్బన్ ఉద్గారాలు మరింత పెరిగే ప్రమాదం ఉంటుంది. ఈ పరిస్థితులన్నింటికి ప్రధాన కారణం మానవ చర్యలే. శిలాజ ఇంధనాలపై ఆధారపడిన అభివృద్ధి నమూనా, అడవుల నరుకుడు, నియంత్రణలేని పట్టణ విస్తరణ, వినియోగ సంస్కృతి ఇవన్నీ కలిసి భూగోళ ఉష్ణోగ్రతలను ప్రమాదకర స్థాయికి తీసుకువచ్చాయి. 2015 సంవత్సరంలో కుదిరిన పారిస్ వాతావరణ ఒప్పందం ద్వారా ప్రపంచ దేశాలు ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్ లోపే పరిమితం చేయాలని నిర్ణయించుకున్నప్పటికీ అమలులో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.**

## భారతదేశం - వాతావరణ మార్పులు

భారతదేశం వాతావరణ మార్పుల ప్రభావానికి అత్యంత దుర్బలంగా మారుతున్న దేశాలలో ఒకటిగా అంతర్జాతీయ అధ్యయనాలు స్పష్టంగా గుర్తిస్తున్నాయి. జనసాంద్రత అధికంగా ఉండటం, భౌగోళిక వైవిధ్యం విస్తృతంగా ఉండటం, వ్యవసాయంపై ఆధారపడిన జనాభా శాతం ఎక్కువగా ఉండటం వంటి అంశాలు ఈ దుర్బలత్వాన్ని మరింత పెంచుతున్నాయి. 2050 నాటికి భారతదేశంలో తీవ్రమైన వేడికి గురయ్యే జనాభా శాతం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. 2010 సంవత్సరంలో భారతదేశంలో అధిక ఉష్ణోగ్రతల ప్రభావానికి లోనైన జనాభా పరిమిత స్థాయిలో ఉండగా 2050 నాటికి ఇది రెట్టింపు స్థాయికి చేరే ప్రమాదం ఉంది. ఇప్పటికే అనేక ప్రాంతాలలో వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్ దాటుతున్నాయి. ఉత్తర భారతదేశం, మధ్య భారతదేశం, తూర్పు భారతదేశంలోని విస్తారమైన ప్రాంతాలు వరుసగా అనేక రోజులు తీవ్రమైన వేడిని ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితి ఆరోగ్యం, ఉపాధి, ఉత్పాదకతపై ప్రత్యక్ష ప్రభావం చూపుతోంది. భారతదేశంలో వాతావరణ మార్పుల విధానాభ్యాసం మూడు ప్రధాన స్థాయిల్లో పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఒకటి నివారణ విధానాలు. రెండు అనుసరణ విధానాలు. మూడు సామాజిక న్యాయ కోణం. నివారణ విధానాల పరంగా చూస్తే భారతదేశం శిలాజ ఇంధనాలపై ఆధారాన్ని క్రమంగా తగ్గించాల్సిన పరిస్థితి ఎదుర్కొంటోంది. ప్రస్తుతం దేశ విద్యుత్ ఉత్పత్తిలో పెద్ద భాగం బొగ్గుపైనే ఆధారపడి ఉంది. ఇది కార్బన్ ఉద్గారాలను పెంచుతోంది. 2030 నాటికి పునరుత్పాదక శక్తి సామర్థ్యాన్ని భారీగా పెంచాలని భారతదేశం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ అమలు వేగం ఇంకా సరిపడా స్థాయిలో లేదు. సౌర శక్తి, గాలిశక్తి విస్తరణకు భూసేకరణ సమస్యలు, పెట్టుబడుల కొరత, సాంకేతిక అవరోధాలు ఎదురవుతున్నాయి.

రవాణా రంగం కూడా కీలకమైన అంశం. పట్టణాల్లో వాహనాల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ఇది వాయు కాలుష్యాన్ని తీవ్రతరం చేస్తోంది. విద్యుత్ ఆధారిత రవాణా విధానాలను ప్రోత్సహించడానికి సబ్సిడీలు, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా రవాణా బలోపేతం వంటి చర్యలు మరింత వేగంగా అమలవ్వాలి. వ్యక్తిగత వాహనాలపై ఆధారాన్ని తగ్గించే విధానాలు తీసుకురావడం అత్యవసరం. అనుసరణ విధానాల విషయానికి వస్తే భారతదేశానికి ఇది అత్యంత కీలక అంశం. ఎందుకంటే వాతావరణ మార్పుల ప్రభావాలు ఇప్పటికే అనుభవంలోకి వచ్చాయి. వ్యవసాయ రంగంలో వాతావరణ అనుకూల సాగు పద్ధతులను విస్తృతంగా ప్రవేశపెట్టాలి. తక్కువ నీటితో పండే పంటలు, వేడి తట్టుకునే విత్తనాలు, సాగునీటి సమర్థ వినియోగం వంటి చర్యలు రైతుల వరకు చేరాల్సిన అవసరం ఉంది. రైతు ఆదాయం వాతావరణ ప్రమాదాల కారణంగా తీవ్రంగా దెబ్బతింటున్న నేపథ్యంలో బీమా వ్యవస్థలను మరింత బలంగా అమలు చేయాలి. నీటి వనరుల నిర్వహణ భారతదేశానికి మరో పెద్ద సవాలు. భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోతున్నాయి. వర్షపాతం అసమానంగా మారుతోంది. ఒకే ప్రాంతంలో కరవు పరిస్థితులు కనిపిస్తే మరో ప్రాంతంలో వరదలు సంభవిస్తున్నాయి. 2050 నాటికి దేశంలోని అనేక నగరాలు తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొనే ప్రమాదం ఉందని అంచనాలు చెబుతున్నాయి. వర్షపు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, నదీ పరివాహక ప్రాంతాల రక్షణ వంటి విధానాలు స్థానిక స్థాయిలో కఠినంగా అమలవ్వాలి. పట్టణ ప్రణాళిక కూడా వాతావరణ విధానాల్లో కీలక భాగంగా మారాలి. భారతదేశంలో పట్టణ జనాభా 2050 నాటికి 50% దాటే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న నగరాలు వేడిని ఎక్కువగా నిల్వ చేసుకునే నిర్మాణాలతో ఉన్నాయి. పచ్చదనం తగ్గిపోవడం వల్ల పట్టణ ఉష్ణ ద్వీప ప్రభావం తీవ్రంగా మారుతోంది. భవన నిర్మాణ నియమాలలో మార్పులు, పచ్చ పైకప్పులు, చెట్ల విస్తరణ, జలాశయాల పరిరక్షణ వంటి చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలి. ఆరోగ్య రంగంలో వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యేక విధానాలు అవసరం. వేడి సంబంధిత మరణాలు ఇప్పటికే పెరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాల కొరత కారణంగా పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. వేడి హెచ్చరిక వ్యవస్థలు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, అత్యవసర వైద్య సేవల బలోపేతం అత్యంత అవసరం.



- డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
పౌర సంబంధాల అధికారి, కేయూ

సామాజిక న్యాయ కోణంలో చూస్తే వాతావరణ మార్పుల భారం సమానంగా పంచబడడం లేదు. పేదలు, కూలీలు, గిరిజన సముదాయాలు, తీర ప్రాంత ప్రజలు ఎక్కువగా నష్టపోతున్నారు. విధానాలు రూపొందించే సమయంలో ఈ వర్గాల అవసరాలు కేంద్రంగా ఉండాలి. అభివృద్ధి పేరుతో వారి జీవనాధారాలను కోల్పోయే పరిస్థితులు మరింత ప్రమాదకరంగా మారతాయి. వాతావరణ మార్పులను కట్టడిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై మాత్రమే కాదు. పరిశ్రమలు తమ ఉత్పత్తి విధానాలను పర్యావరణ అనుకూలంగా మార్చుకోవాలి. ఆర్థిక సంస్థలు స్థిరమైన పెట్టుబడులకు ప్రాధాన్యం ఇవ్వాలి. విద్యా సంస్థలు వాతావరణ అవగాహనను పాఠ్యాంశాలలో భాగంగా తీసుకురావాలి. పౌరులు తమ వినియోగ అలవాట్లను మార్చుకోవాలి. భారతదేశం అభివృద్ధి లక్ష్యాలను వదిలిపెట్టలేని దేశం. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణను పక్కన పెట్టలేని పరిస్థితి కూడా ఉంది. ఈ రెండు లక్ష్యాల మధ్య సమతుల్యత సాధించడమే భారతదేశ విధానాభ్యాసం అసలు సవాలు. 2050 నాటికి భారతదేశం తీసుకునే నిర్ణయాలు దేశ భవిష్యత్తును మాత్రమే కాదు. ప్రపంచ వాతావరణ దిశను కూడా ప్రభావితం చేస్తాయి. సమయోచిత చర్యలు తీసుకుంటే వాతావరణ మార్పులను పూర్తిగా ఆపలేకపోయినా వాటి ప్రభావాలను తగ్గించడం సాధ్యమే. ఆలస్యం జరిగితే నష్టాలు తిరిగి పూడ్చలేని స్థాయికి చేరుతాయి. భారతదేశం ముందున్న ఈ సవాలు ఒక అవకాశం కూడా. స్థిరమైన అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లేందుకు ఇది ఒక చారిత్రాత్మక మలుపుగా మారవచ్చు.

భారతదేశం ప్రస్తుతం నిలిచిన దశ ఒక సాధారణ అభివృద్ధి మలుపు కాదు. ఇది వాతావరణ మార్పుల కారణంగా ఏర్పడిన చారిత్రాత్మక సంక్షోభ దశ. 2050 నాటికి దేశ జనాభాలో పెద్ద భాగం తీవ్రమైన వేడి ప్రభావానికి లోనయ్యే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పరిస్థితిని నిర్లక్ష్యం చేయడం భవిష్యత్ తరాలపై తీరని భారాన్ని మోపినట్లే అవుతుంది. వాతావరణ మార్పులు ఇక భవిష్యత్ అంచనాలు మాత్రమే కాదు. ఇవి ఇప్పటికే అనుభవంలోకి వచ్చిన వాస్తవాలు. భారతదేశంలో అభివృద్ధి లక్ష్యాలు పేదరిక నిర్మూలన, ఉపాధి సృష్టి, ఆహార భద్రత వంటి అంశాలతో ముడిపడి ఉన్నాయి. అయితే వాతావరణ అస్థిరత ఈ లక్ష్యాలన్నింటినీ ప్రమాదంలోకి నెడుతోంది. వ్యవసాయం దెబ్బతింటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూలిపోతుంది. ఆరోగ్యంపై భారమైతే ప్రభుత్వ వ్యయాలు పెరుగుతాయి. నీటి కొరత పెరిగితే పట్టణ జీవనం అస్థిరంగా మారుతుంది. ఈ ప్రభావాలన్నీ ఒకదానితో ఒకటి అనుసంధానమై దేశ సామాజిక నిర్మాణాన్ని దెబ్బతీస్తాయి. ఈ నేపథ్యంలో
భారతదేశ విధానాలు తక్షణ చర్యల దిశగా మళ్లాల్సిన అవసరం ఉంది. వాతావరణ మార్పులను భవిష్యత్ సమస్యగా చూసే ధోరణి పూర్తిగా మారాలి. ప్రతి అభివృద్ధి ప్రణాళికలో వాతావరణ ప్రభావ అంచనాలు తప్పనిసరి భాగంగా ఉండాలి. శక్తి రంగం నుంచి పట్టణ ప్రణాళిక వరకు ప్రతి రంగంలో స్థిరత్వమే కేంద్ర బిందువుగా మారాలి. ఇది ఒక ఎంపిక కాదు. ఇది తప్పనిసరి మార్గం. బాధ్యత ప్రశ్నను స్పష్టంగా చెప్పుకోవాలి. కేంద్ర ప్రభుత్వం విధాన రూపకల్పనలో నాయకత్వం వహించాలి. రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అమలు వ్యూహాలు రూపొందించాలి. పరిశ్రమలు లాభాలకే పరిమితమైన దృష్టిని వదిలి సామాజిక బాధ్యతను స్వీకరించాలి. ఆర్థిక సంస్థలు తక్షణ లాభాల కంటే దీర్ఘకాలిక స్థిరత్వాన్ని ప్రాముఖ్యంగా చూడాలి. పౌరులు తమ రోజువారీ వినియోగ నిర్ణయాల ద్వారా మార్పుకు భాగస్వాములు కావాలి. భారతదేశానికి ఈ సంక్షోభం ఒక అవకాశం కూడా. పాత అభివృద్ధి నమూనాలను పునరాలోచించే సమయం ఇది. స్థానిక వనరుల ఆధారిత ఆర్థిక వ్యవస్థలు, ఉపాధి సృష్టితో కూడిన పర్యావరణ పరిరక్షణ, సామాజిక న్యాయంతో కూడిన వృద్ధి ఇవన్నీ ఒకే దిశలో ముందుకు నడిచే అవకాశం ఉంది. సరైన నిర్ణయాలు తీసుకుంటే భారతదేశం వాతావరణ నాయకత్వం చూపగల దేశంగా మారవచ్చు.కాలం వేగంగా గడుస్తోంది. 2030 లక్ష్యాలు చేరువవుతున్నాయి. 2050 దశ స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడే చర్యలు తీసుకుంటే నష్టాలను కొంతవరకు నియంత్రించగలుగుతాం. ఆలస్యం జరిగితే పరిస్థితులు మన చేతుల్లో ఉండవు. వాతావరణ మార్పులపై భారతదేశం తీసుకునే నిర్ణయాలే దేశ భవిష్యత్తు భద్రతను నిర్ణయిస్తాయి. ఇది కేవలం పర్యావరణ అంశం కాదు. ఇది జాతీయ జీవన ప్రశ్న.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.